


పెదగదిలి జంక్షన్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

కుండపోత

నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీవర్షం

- రహదారులు జలమయం
- ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు
- విశాలాక్షినగర్‌లో 138.25 మి.మీ.
- జోగవానిపాలెంలో 123.25 మి.మీ.
- తెల్లవారుజామున ఉరుములు, పిడుగులతో దద్దరిల్లిన నగరం

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

వాయుగుండం తీరం దాటే సమయం (గురువారం తెల్లవారుజామున)లో ఉరుములు, పిడుగులతో నగరం దద్దరిల్లింది. అదే సమయంలో ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. నగరంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటలకు మొదలైన వర్షం గురువారం ఉదయం వరకూ కొనసాగింది.

భారీ వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. హనుమంతువాక జంక్షన్ నుంచి సింహాచలం వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డు మీదకు సమీపంలోని కొండల పై నుంచి ఎర్రటి బురదతో కూడిన నీరు వచ్చిచేరింది. గెడ్డలు పొంగిపొర్లాయి. ఉదయం వర్షంతో అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారంతా ఇబ్బందిపడ్డారు. నగరంలో ముఖ్యంగా సీతమ్మధార, ఎం.వి.పి. కాలనీ, ఆరిలోవ, ఎండాడ ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. ఉదయానికి వర్షం తగ్గుముఖం పట్టినా ముసురు వాతావరణం కొనసాగింది. సాయంత్రం వరకు పలు దఫాలుగా ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షమని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

భారీ వర్షపాతం నమోదు

బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు విశాలాక్షినగర్‌లో 138.25 మి.మీ., జోగవానిపాలెంలో 123.25, ఎండాడలో 120.75 మి.మీ., ఎంవీపీ కాలనీలో 114, సీతమ్మధార హెచ్‌బీ కాలనీలో 113.75, ఆరిలోవల్లో 105.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంకా కాపులుప్పాడలో 82.25, గంగవరంలో 74.5, గోపాలపట్నంలో 71.25, ములగాడలో 60.25 మి.మీ. వర్షపాతం నమోదైంది. నగరంతోపాటు పరిసరాల్లో అనేకచోట్ల 50 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. శుక్రవారం నగరంలో పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.




ఎంవీపీ కాలనీలో జలమయమైన రోడ్డు

న్యూస్ బాక్స్

విద్యార్థులకు చేరువగా పర్యాటక కేంద్రాలు

- ప్రభుత్వ సంస్థల్లో చదివే వారికి ఉచిత ప్రవేశం
- ప్రైవేటు సంస్థల విద్యార్థులకు రూ.10 టికెట్

మహారాణిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా జిల్లాలోని పర్యాటక, విజ్ఞాన కేంద్రాలను విద్యార్థులకు మరింత చేరువ చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎడ్యుకేషన్ టూరిజం బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ టూరిజంపై వివిధ మార్గాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం నింపాలన్నారు. నగర పరిధిలోని మెరైన్ మ్యూజియం, సీ హారియర్, టీయూ 142, మారిటైమ్ మ్యూజియం, జూ పార్కు, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించే మడ అడవుల పరిశోధన కేంద్రం, తదితర పర్యాటక ప్రదేశాల్లో విద్యార్థులకు ఉచిత, రాయితీతో కూడిన ప్రవేశం కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా, ప్రైవేటు సంస్థల విద్యార్థులకు కేవలం రూ.10 ప్రవేశ రుసుం వసూలు చేసి, ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తామని ఈ సందర్భంగా అధికారులు ప్రకటించారు.

ప్రారంభం కాని 50 మద్యం దుకాణాలు

- భవనాల కోసం వ్యాపారుల వెతుకులాట

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కొన్నిచోట్ల మద్యం దుకాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. మొత్తం 155 మద్యం దుకాణాలను అధికారులు లాటరీ ద్వారా వ్యాపారులకు కేటాయించారు. దుకాణాలు దక్కించుకున్న వారంతా బుధవారం ఉదయం నుంచే విక్రయాలు ప్రారంభించుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే వంద దుకాణాలు మాత్రమే బుధ, గురువారాల్లో ప్రారంభం అయ్యాయి. మిగిలినచోట్ల భవనాలు లభ్యం కాకపోవడంతో దుకాణాలు ప్రారంభించడానికి అవకాశం లేకుండాపోయింది. ఇదిలావుండగా బుధవారం కొన్నిచోట్ల ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయించినట్టు అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారం ఎంఆర్‌పీకే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

చికాకు పెట్టే మెనోపాజ్!



- మహిళల్లో రుతుక్రమం నిలిచిపోయే దశలో ఇబ్బందులు
- నేడు వరల్డ్ మెనోపాజ్ డే - 8లో

సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టు



- చైనా, తైవాన్‌ల నుంచి ఆపరేషన్
- సహకరిస్తున్న విశాఖకు చెందిన ఏడుగురి అరెస్టు - మెయిన్ 12లో

సమస్య పరిష్కారం ఎన్నడో?

- 2026 జనవరిలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి ఏర్పాట్లు
- అలోగా ఫ్లైఓవర్లు నిర్మించకుంటే విమాన ప్రయాణికులకు ఇక్కట్లే
- నగరంలో పన్నెండుచోట్ల నిర్మాణానికి గతంలో డీపీఆర్ సిద్ధం చేసిన ఎన్‌హెచ్‌ఏఐ
- మెట్రో రైలు ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకుని ఎలివేటెడ్ కారిడార్‌ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- మళ్లీ అధ్యయనం చేస్తున్న అధికారులు
- మెట్రోతో లింకు పెడితే కష్టమేనన్న వాదన
- వాస్తవ అవసరాలతో పనులు చేపట్టడమే మేలు

ట్రాఫిక్ పద్మవ్యూహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉన్నాయి. గత ప్రభుత్వం విశాఖపట్నం మీదుగా ఆనందపురం వెళ్లే జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య నివారణకు 12 ఫ్లైఓవర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకువచ్చింది. దీనికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) తయారు చేసింది. సుమారు రూ.350 కోట్లతో టెండర్లు పిలవడానికి ఏర్పాట్లుచేసింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

కొత్తగా ఎలివేటెడ్ కారిడార్ల ప్రతిపాదన

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జూలైలో విశాఖపట్నం వచ్చినప్పుడు విమానాశ్రయంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రధాన సమస్యలు ప్రస్తావనకు రాగా ఫ్లైఓవర్ల నిర్మాణం గురించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వివరించారు. విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన కూడా ఉన్నందున ఆ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఫ్లైఓవర్ల డిజైన్లలో మార్పు చేయాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని ఆదేశించారు. కనీసం రెండు కారిడార్లు ఉంటే బాగుంటుందని, ఆ మేరకు అధ్యయనం చేసి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఎలివేటెడ్ కారిడార్లకు కిలోమీటరుకు రూ.125 కోట్ల వ్యయం అవుతుందని, ఆ మేరకు నిధులు కావాలంటే ఢిల్లీ స్థాయిలో మళ్లీ చర్చలు జరపాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలియజేశారు. ముందు అంచనాలు తయారుచేస్తే ఆ తరువాత సంగతి తాను చూసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. ఇది జరిగి మూడు నెలలు కావస్తోంది. ఇంకా అధ్యయన దశలోనే ఉంది.

ప్రతి జంక్షన్ పద్మవ్యూహమే

ప్రస్తుతం నగర ప్రజలు విశాఖ విమానాశ్రయం చేరుకోవడానికి పెద్దగా ఇబ్బంది పడడం లేదు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మించిన తరువాత సమస్యలు చాలా వరకు తగ్గాయి. అయితే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలంటే మాత్రం అనేక సమస్యలు ఉన్నాయి. అందుకే ... మిగతా 6వ పేజీలో


హనుమంతవాక జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్ (ఫైల్ ఫొటో)

శరవేగంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పనులను జీఎంఆర్ సంస్థ ఇప్పటికే 40 శాతం పూర్తిచేసింది. 2025 డిసెంబరు నాటికి పూర్తిచేసి, 2026 జనవరిలో ప్రారంభించాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంది.అంటే ఇంకో 14 నెలల్లో విమానాశ్రయం సిద్ధం అయిపోతుంది. అప్పుడు విశాఖలోని విమానాశ్రయంలో పౌర విమానాల రాకపోకలు ఆగిపోతాయి. ప్రస్తుతం విశాఖనుంచి రాకపోకలు చేస్తున్న విమాన ప్రయాణికులంతా భోగాపురం వెళ్లాల్సి ఉంటుంది. విశాఖ నుంచి భోగాపురం సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ రహదారిపై వెళితే సుమారు 75 నిమిషాలు పడుతుంది. ఈ దూరానికి ప్రస్తుతం టాక్సీలు ఒక వైపు రూ.2,500 చార్జీ వసూలు చేస్తున్నాయి. ఒక ప్రయాణికుడు విశాఖ నుంచి భోగాపురం వెళ్లి, తిరిగి నగరంలోకి వస్తే టాక్సీ చార్జీల కింద రూ.5 వేలు ఖర్చు చేయాలి. అంటే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ఒక వైపు విమాన చార్జీలతో సమానం. జాతీయ రహదారిపై ప్రయాణ సమయం కూడా ఆయా నగరాలకు విమాన ప్రయాణ సమయంతో సమానం. అంటే విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయం చేరడానికి టాక్సీలో ఎంత సమయం పడుతుందో...ప్రయాణికులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై చేరుకోవడానికి కూడా అంతే సమయం పడుతుంది.

మంత్రి నారా లోకేశ్ రాక


ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు పల్లా, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చిన ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకులు దాడి రత్నాకర్, మహ్మద్ నజీర్, సీతంరాజు సుధాకర్, కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు స్వాగతం పలికారు. లోకేశ్ విమానాశ్రయం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. ఆయన శుక్రవారం కోర్టుకు హాజరవుతారు. శనివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేవీ చీఫ్ తూర్పు నౌకాదళం సందర్శన



- జెట్టీ ప్రారంభం

భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి తన భార్య శశి త్రిపాఠితో కలిసి తూర్పు నౌకాదళం సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఎన్1-ఎన్3 జెట్టీని ప్రారంభించారు. నేవీలోకి కొత్తగా వచ్చే నౌకలను బెర్తింగ్ చేయడానికి ఈ జెట్టీ ఉపయోగించనున్నారు. ఆ తరువాత వివిధ అంశాలను సమీక్షించారు. పర్యటన ముగించుకొని తిరిగి వెళ్లిపోయారు.-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

కార్పొరేటర్ల కలెక్షన్!

అధ్యయన యాత్ర కోసం భారీగా వసూళ్లు

- రవాణా, హోటల్ ఖర్చులు చెల్లించేందుకు జీవీఎంసీ అంగీకారం
- ఇతరత్రా వాటి కోసం కాంట్రాక్టర్లకు టార్గెట్లు
- రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఏటా జీవీఎంసీలోనే అధ్యయన యాత్ర పేరిట ప్రజాధనం దుర్వినియోగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"అధ్యయన యాత్రకు వెళుతున్నాం. వంద మంది కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల సహాయకులు మొత్తం 150 మంది... జీవీఎంసీ కేటాయించే మొత్తం టిక్కెట్లు, హోటల్ బిల్లుకే సరిపోతాయి. అదనపు ఖర్చులకు డబ్బులు అవసరం. మీ వాటాగా ఎంతో కొంత ఇవ్వండి."

- ఇదీ జీవీఎంసీ కాంట్రాక్టర్లకు కూటమికి చెందిన కొందరు కార్పొరేటర్లు హుకుం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జీవీఎంసీలో కూడా వైసీపీ మెజారిటీ తగ్గిపోయింది. కూటమి బలం పెరిగింది. అయితే వైసీపీ హయాంలో అనుసరించిన పద్ధతులనే కూటమికి చెందిన కార్పొరేటర్లు అనుసరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. జీవీఎంసీ కార్పొరేటర్లు ఏటా అధ్యయన యాత్ర పేరుతో దేశంలోని వివిధ నగరాలను సందర్శిస్తుంటారు. అందుకోసం కార్పొరేషన్ నిధులు ఖర్చు చేస్తుంటారు. తాజా పాలకవర్గం ఏర్పడిన తర్వాత కూడా కార్పొరేటర్లు రెండుసార్లు అధ్యయన యాత్ర పేరిట ఉత్తర భారతదేశంలోని పలు నగరాలు తిరిగి వచ్చారు. పేరుకు అధ్యయన యాత్ర అయినప్పటికీ కుటుంబసభ్యులను వెంట తీసుకువెళ్లి విహారయాత్ర మాదిరిగా గడిపి వచ్చారు. కనీసం తమ పర్యటనలో అధ్యయనం చేసిన ప్రాజెక్టులు, పథకాల గురించి ఒక్కమాట కూడా ఎవరూ, ఎప్పుడూ మాట్లాడిన దాఖలాలు లేవు. తాజాగా మరోసారి కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. ఈనెల 20 నుంచి 27 వరకూ బెంగళూరు, మైసూరు, కోయంబత్తూరు, గోవా ... మిగతా 6వ పేజీలో



ముంచెత్తిన వరద.. దారులు దయనీయం

కొన్నేళ్లుగా రోడ్లు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారులపై ఉన్న గోతుల్లో చినుకు పడితే చాలు వర్షం నీరు చేరి రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా తయారై చిత్తడిగా మారిపోతున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

- గోతుల రహదారులపై నిలిచిన వర్షం నీరు
- పాదచారులు, వాహనదారులకు తప్పని కష్టాలు
- చినగదిలి జంక్షన్‌లో వరద నీరు
- చిరు వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగుల పాట్లు


పెదగదిలి జంక్షన్‌లో వరద నీటి మధ్య వాహనదారుల అవస్థలు

రహదారులపై నిలిచిన వర్షం నీరు

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15, 16 వార్డుల ప్రధాన రహదారి సీతమ్మధార నుంచి హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై కాలువల్లో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ మెయింటనెన్స్, పోలీసు కార్యాలయం వద్ద రోడ్డు సుందరీకరణలో భాగంగా వేసిన ఫుట్‌పాత్ వద్ద వర్షపు నీరు వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా నీరు రోడ్డుపైనే నిలిచిపోయే దుస్థితి. కాలువలపై పెద్ద సిమెంటు మూతలు వేసేశారు. దీంతో కాలువల్లో పేరుకుపోయిన పూడికను పారిశుధ్య కార్మికులు తొలగించడానికి వీలు కావడం లేదు. వాన నీరు కిందకు ప్రవహించే మార్గాలు మూసుకుపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరు రోడ్లపైకి చేరుతోంది. స్థానికులతో పాటు ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

17వ వార్డులో చినుకు పడితే చిత్తడే..

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ పదో సెక్టరు ప్రధాన రహదారి వద్ద పరిస్థితి ఇది. చిన్న చినుకు పడినా చిత్తడిగా మారుతోంది.
ఎంవీపీ కాలనీ కూడలి నుంచి ఏఎస్ రాజా సర్కిల్‌కు మధ్య రహదారిలో బస్ షెల్టరు వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం నీరు లేదా మురుగు నీరు నిల్వ ఉండిపోతోంది. బస్ షెల్టరు వద్ద ప్రయాణికులు నిల్చోడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి. రహదారికి ఓ పక్క పూర్తిగా వివిధ బడ్డీలతో కొందరు వ్యాపారులు రహదారులు ఆక్రమించేశారు. దీంతో వాహనచోదకుల ప్రయాణానికి, పాదచారుల నడకకూ ఇబ్బందికరంగా మారింది. వర్షం లేనప్పుడు కూడా మురుగు నీరు ఇక్కడ నిల్వ ఉంటోంది. పారిశుధ్య నిర్వహణ విభాగం అధికారులు సమస్యను పరిష్కరించాల్సిందిగా ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


పదో సెక్టర్ బస్టాప్ ముందే నిలిచి ఉన్న నీరు

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకూ కురిసిన భారీ వర్షాలకు పెదగదిలి జంక్షన్ వరద నీటితో నిండిపోయింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్రఇబ్బందులు నెలకొన్నాయి. హైస్కూలుకు వెళ్లే విద్యార్థులు అవస్థలు ఎదుర్కొన్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న చిరువ్యాపారస్తుల దుకాణాలు వరద నీటిలో మునిగి పోయాయి. సుమారు రెండు అడుగు మేర వరద నీరు చేరింది. సింహాచలం వైపు వెళ్ళే వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి ఆరిలోవ అంబేడ్కరు జంక్షన్ వెళ్ళే మార్గంలో ఉన్న సూర్యతేజనగర్ పూర్తిస్థాయిలో లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వరద నీరు చేరింది. ఇటీవల రోడ్లు, కాలువలను నిర్మించినప్పటికీ ఆ పనులు సరిగా చేపట్టకపోవడంతో ఈ విధంగా వరద ముంచుకొస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూలిన గోడ

దీనదయాళ్‌పురంలో గల బాలుర వసతి గృహం, బాలుర పరిశీలన గృహానికి మధ్యంలో గల ప్రహరీ గోడ గురువారం ఉదయం భారీ వర్షాలకు కూలిపోయింది. ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారులకు తెలిపామని, వారు వచ్చి పరిశీలించారని పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య తెలిపారు.


కూలిన గోడ పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

కార్పొరేటర్ల కలెక్షన్!

... 5వ పేజీ తరువాయి

అధ్యయన యాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మేయర్ ముందస్తు అనుమతి ఇవ్వడంతో ఒక్కో కార్పొరేటర్‌కు అధ్యయన యాత్రకు రూ.1.2 లక్షలు ఖర్చుతో అన్ని ఏర్పాట్లుచేసేందుకు షార్ట్ టెండర్ పిలిచారు.

కాంట్రాక్టర్లకు టార్గెట్లు:

కేవలం వంద మంది కార్పొరేటర్లకు అయ్యే ఖర్చులను మాత్రమే లెక్కించి జీవీఎంసీ నిధులు వెచ్చించేలా టెండర్ పిలిచారు. కానీ మహిళా కార్పొరేటర్లకు తోడు వారి కుటుంబసభ్యుల్లో ఒకరు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. అందుకు అదనంగా మరో రూ.70 లక్షల వరకూ ఖర్చవుతుంది. అలాగే ఆయా నగరాలకు వెళ్లినప్పుడు అక్కడ పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రముఖక్షేత్రాలను సందర్శించేందుకు కార్పొరేటర్లు సొంతంగా ఖర్చులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని కార్పొరేటర్లందరికీ సర్దుబాటు చేస్తామని కూటమికి చెందిన కార్పొరేటర్లు కొందరు హామీ ఇచ్చినట్టు సమాచారం. దీంతో దాదాపు రూ.1.5 కోట్లు వరకూ అదనంగా అవసరం అవుతుండడంతో ఆ మొత్తాన్ని సమకూర్చాలంటూ కొంతమంది కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీ హయాంలో ఇదే పరిస్థితి ఎదుర్కొన్నామని, ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అదే ధోరణి కొనసాగుతోందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీలో తప్పితే రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్లలో ఎక్కడా కార్పొరేటర్లంతా మూకుమ్మడికిగా అధ్యయన యాత్రలకు వెళ్లిన దాఖలాలు లేవు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌లో రెండేళ్ల కిందట ఇలాంటి ప్రతిపాదన చేస్తే, తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో వెనక్కితగ్గారు.అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రాజెక్టులను పరిశీలించదలచుకుంటే మేయర్, డిప్యూటీ మేయర్లు, అన్నిపార్టీల ఫ్లోర్‌లీడర్లతోపాటు అధికారులు వెళ్లవచ్చునని, ఇలా అందరూ కలిసి వెళ్లడమేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్ పద్మవ్యూహం

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం వరకూ రహదారిపై 12 ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఆ ప్రకారం కూర్మన్నపాలెం, గాజువాక, షీలానగర్, మురళీనగర్, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక, ఎండాడ, కారు షెడ్ జంక్షన్, కొమ్మాది జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రణాళికలు ఉన్నాయి. వీటిని మూడు డిజైన్లతో రూపొందించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో + ఆకారంలో, మూడు రోడ్ల జంక్షన్‌లో 'వై' ఆకారంలో, రెండు రోడ్ల జంక్షన్‌లో 'టి' ఆకారంలో ఫ్లైఓవర్లు వేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రతిపాదించారు. అవసరమైనచోట్ల అండర్ పాస్‌వేలు కూడా వేస్తామని చెప్పారు. ప్రస్తుతం పైన పేర్కొన్న జంక్షన్లను దాటి వెళ్లాలంటే కనీసం రెండు నుంచి నాలుగు నిమిషాల సమయం పడుతోంది. ఈ 12 జంక్షన్లలోనే అరగంట ఆగిపోవలసి వస్తోంది. ఫ్లైఓవర్లు నిర్మించకపోతే భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది.

మెట్రో ఇప్పట్లో అసాధ్యం

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే మెట్రో రైలు ప్రాజెక్టుకు శ్రీకారం చేపట్టారు. పదేళ్లయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఆ ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు అవసరం. పెట్టుబడికి తగిన రాబడి వచ్చే అవకాశాలు తక్కువ. అటువంటి ప్రాజెక్టుతో ముడిపెట్టి...ఎలివేటెడ్ కారిడార్ అంటూ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని పక్కనపెట్టడం సమంజసమేనా?...అనేది పునరాలోచన చేయాలి. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా విశాఖపట్నం నుంచి అక్కడకు ఏ సమస్య లేకుండా సాఫీగా వెళ్లిపోయే ఏర్పాట్లు చేయాలి. అది ఫ్లైఓవర్ల ద్వారా సాధ్యమవుతుందా? లేదా కోస్టల్ కారిడార్ ద్వారా వీలవుతుందా?...అనేది ప్రభుత్వమే నిర్ణయించుకొని తక్షణం పనులు చేపట్టాలి.


అన్నదానంలో పాల్గొని వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఉషోదయ జంక్షన్‌లో అన్నసమారాధన

ఎంవీపీ కాలనీ/ పెద వాల్తేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 17 వార్డు పరిధిలోని ఉషోదయ జంక్షన్‌లోని ఆటో స్టాండులో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విజయదశమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏలో మహర్షి వాల్మీకి జయంతి


వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

సిరిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కృషి, పట్టుదల ఉంటే ఎంతటివారైనా రుషులవుతారడానికి నిదర్శనం మహర్షి వాల్మీకి నిదర్శనమని వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ అన్నారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి ఆయనతో పాటు విభాగాధిపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఒక బోయి మహర్షిగా మారి యావత్ ప్రపంచం కీర్తించే రామాయణ మహాకావ్యం రచించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అకౌంటెంట్ హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతిస్వరూప్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువజనోత్సవాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని గురువారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అభినందించారు. నవంబరు 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగేయువజనోత్సవాల్లో ఎం.శివాని లహరి, డి.హర్షిత పాల్గొంటారు. దేశవ్యాప్తంగా 124 మంది యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన కారును గుర్తించండి

- పోలీసులకు బాధిత విద్యార్థి తండ్రి వినతి

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గీతం కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థికి జోడుగుళ్లపాలెం వద్ద ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిన కారును గుర్తించాలని ఆరిలోవ పోలీసులకు బాధిత విద్యార్థి తండ్రి ఉదయకుమార్ గురువారం కోరినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరావు తెలిపారు. ఈ నెల 7న రాంనగర్‌కు చెందిన సర్వసిద్ధి చరణ్‌సాయివంశీ గీతం కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా, జోడుగుళ్ళపాలెం వద్ద గల స్పీడు బ్రేకరువద్ద వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్‌సాయివంశీకి బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స అందింది. ప్రస్తుతం తమ కుమారుడి ఆరోగ్యం బాగానే ఉందని, ప్రమాదానికి కారణమైన కారును గుర్తించాలని ఉదయ్‌కుమార్ పోలీసులను కోరారు. నిందితుడిని అరెస్టు చేయాలని తమకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు సీఐ తెలిపారు.

జీవీఎంసీలో వాల్మీకి మహర్షి జయంతి

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకను గురువారం విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ అధికారులు ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి శ్లోకమనే నిర్మాణ ప్రక్రియను కనుగొన్న మహా మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్ జైన్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకికి నివాళి అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు

ప్రీపెయిడ్ ట్యాక్సీల్లో ప్రయాణం సురక్షితం : సీపీ

గోపాలపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విమానాశ్రయంలో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసును వినియోగించుకోవడం వల్ల ప్రయాణికులు సురక్షితంగా, భద్రంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రీపెయిడ్ ట్యాక్సీ నడిపే డ్రైవర్‌కు సంబంధించిన డేటా అంతా పోలీసుల వద్ద ఉంటుందని.. తద్వారా ప్రయాణికులు నిశ్చింతగా ప్రయాణాలు సాగించవచ్చని పేర్కొన్నారు. విమానాశ్రయ డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, విమానాశ్రయ సిబ్బంది, ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి, రాజారెడ్డి, తదితరులు

ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

ఇంజనీరింగ్ అధికారులకు
జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశం

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన సీ హార్స్ జంక్షన్ నుంచి ఉన్న ఎస్ఎల్ కెనాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ జోన్-4 పరిధిలో 2.2 కిలోమీటర్ల ఉన్న ఎస్ఎల్ కెనాల్ ఒక కిలోమీటరు వరకు కచ్చా రోడ్డు కలిగి ఉందన్నారు. భారీ వర్షాలు, తుపానులు సంభవించేటప్పుడు కెనాల్‌లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని, దాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు విశాఖ పోర్టు అథారిటీస్ యాజమాన్యంతో చర్చలు జరిపి ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన ఇంజనీరింగ్ శివప్రసాద్‌రాజును ఆదేశించారు. కెనాల్ చివరన ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించి అక్కడ కెనాల్ నిర్మాణానికి కలుగబోయే అడ్డంకులను తొలగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన ఇంజనీర్‌ను కమిషనర్ సూచించారు.

అనంతరం సీహార్స్ జంక్షన్ నుంచి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ పి.వి.వి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


సీ హార్స్ జంక్షన్ నుంచి ఉన్న ఎస్ఎల్ కెనాల్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్

ఏయూ అంతర్ కళాశాలల కబడ్డీ విజేత 'సమత'

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో యలమంచిలి ప్రభుత్వ కళాశాల, డాక్టర్ కృష్ణా కాలేజి

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ టోర్నీలో సమతా డిగ్రీ కాలేజీ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజి, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజి ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలవగా, డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కాలేజి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాలులో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సమతా డిగ్రీకాలేజి 43-14 పాయింట్ల తేడాతో యలమంచిలి ప్రభుత్వ కాలేజి విజయం సాధించగా, మూడో స్థానానికి జరిగిన మ్యాచ్‌లో డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ 21-19 పాయింట్ల తేడాతో బుల్లయ్య కాలేజీపై గెలుపొందింది.

టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రోఫీలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ విజయ్‌మోహన్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న సమతా కళాశాల జట్టు

మాజీ ఎంపీ ఎంవీవీకి షరతులతో ముందస్తు బెయిల్

- హయగ్రీవ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ మాజీ ఎంపీ, వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. హయగ్రీవ భూముల వ్యవహారంలో ఆరిలోవ పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఎంవీవీతో పాటు బిల్డర్ గద్దె బ్రహ్మాజీ, చార్టెడ్ అకౌంటెంట్ జి.వెంకటేశ్వరావుకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. రూ.30 వేలతో ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. మూడు నెలల పాటు ప్రతీ నెల 1, 15వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. పరిధి దాటి వెళ్లాల్సి వస్తే ప్రయాణ వివరాలను దర్యాప్తు అధికారికి అందజేయాలని పేర్కొంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులను ప్రభావితం చేయడం, బెదిరించ కూడదని తేల్చిచెప్పింది. దిగువ కోర్టులో విచారణకు క్రమం తప్పకుండా హాజరుకావాలని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం తీర్పునిచ్చారు.

ఎండాడ గ్రామ పరిధిలో వృద్ధాశ్రమం, అనాధాశ్రమం, వృద్ధులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి తాను తీసుకున్న 12.5 ఎకరాల భూమిని లాక్కునేందుకు ఎంవీవీ సత్యనారాయణ, ఆయన సన్నిహితుడు వెంకటేశ్వరరావు, బిల్డర్ బ్రహ్మాజీ పలు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారంటూ హయగ్రీవ కన్‌స్ట్రక్షన్స్ అధినేత జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆరిలోవ పోలీసులు ఈ ఏడాది జూన్ 22న కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంవీవీ, ఆయన సన్నిహితులు వేర్వేరుగా పిటిషన్లు వేశారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయమూర్తి తాజాగా తీర్పునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణలో భాగంగా చెట్ల నరికివేత, పలు మరమ్మతులు చేపడుతుండడంతో సరఫరాకుఅంతరాయం కలుగుతుందన్నారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్ రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. పైనాపిల్ కాలనీ, కేంద్రకారాగారం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, దీనదయాళ్‌పురం, సీడీ కార్యాలయం, గోల్ఫ్ క్లబ్, ఇండస్ ఆస్పత్రి, ఆరిలోవ పోలీసుస్టేషన్, ఆరిలోవ ఆఖరి బస్టాపు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, కామాక్షినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగన్, సజ్జలను తక్షణమే అరెస్టు చేయాలి : బీవీ రామ్

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును జైలుకు పంపిన సమయంలో ఆయన అభిమానులు కొందరు తీవ్ర ఆవేదనతో ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు కారకులైన మాజీ సీఎం వైఎస్ జగన్, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. గురవారం పైనాపిల్ కాలనీ గల సీడీ కార్యాలయానికి విచ్చేసి ప్రాంతీయ కార్యాలయం అదనపు సూరింటెండెంట్ జి.ప్రేమకాజల్‌కువినతి పత్రం అందజేశారు.

'ప్రతి విద్యార్థి ఉన్నతవంతుడు కావాలి'

ఆరిలోవ, అక్టోబరు 17 : ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. గురువారం ఆమె పైనాపిల్ కాలనీ గల మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులకు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ పేదరికాన్నిజయించేది చదువు మాత్రమేనన్నారు. అందుకే ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రతి విద్యార్థి బాగా చదవేందుకు తొలి ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం ఆమె పాఠశాలలోని వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు ఎల్లప్పుడూ తులనాత్మక విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అవినీతి ఖజానా

- బిల్లులు అప్‌లోడ్‌కు డబ్బులు డిమాండ్
- పలువురు ఉద్యోగులపై సీఎం పేషీకి ఫిర్యాదు
- విచారణకు ఆదేశాలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల
- వాంగ్మూలం తీసుకున్న ఇన్‌చార్జి డీడీ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా కార్యాలయంలో కొంతమంది తీరు మారడం లేదు. కార్యాలయానికి వచ్చే ఉద్యోగుల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. దీనికితోడు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులు హెచ్చరించినా ఎటువంటి మార్పు కనిపించడం లేదు. తాజాగా ముగ్గురు ఉద్యోగులపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లడంతో విజయవాడలోని ఖజానా శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల నుంచి వచ్చే బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు సొమ్ములు తీసుకుంటున్నారని సీఎం కార్యాలయానికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిసింది.

గడచిన ఐదారేళ్లుగా సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగి భారీ అవినీతికి పాల్పడుతున్నారని సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఒక సబ్ ట్రెజరీ నుంచి సుమారు ఆరేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చిన సదరు ఉద్యోగి తరువాత ఇక్కడే ఉండిపోయేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. ఉద్యోగులకు రుణాలు మంజూరు, ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులు/అధికారుల జీతాలకు సంబంధించి సాంకేతిక అంశాలను పరిష్కారం, తదితర విధులు నిర్వహిస్తుంటారు.

సాధారణంగా ట్రెజరీలో పనిచేసే ఉద్యోగులు, అధికారుల జోలికి ఇతర శాఖల ఉద్యోగులు వెళ్లరు. జీతాలు, ఎరియర్స్, ఇతర బిల్లులు మంజూరులో ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయరు. అయితే ఈ పర్యాయం ఎవరి పేర్లు లేకుండా సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో గురువారం ఇన్‌చార్జి డీడీ గోవిందరావు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను పిలిచి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఫిర్యాదులో పేర్కొన్న శాఖలకు చెందిన డ్రాయింగ్ ఆఫీసర్లు, జీతాలు/ఎరియర్స్ బిల్లులు పెట్టే ఉద్యోగులతో కూడా మాట్లాడాలని ఆయన నిర్ణయించారు. కాగా జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల తీరు మారకపోవడంతో పది రోజుల క్రితం డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ సెలవులో వెళ్లిపోయారు. ప్రస్తుతం సీతమ్మధార సబ్‌ట్రెజరీ ఏటీవో గోవిందరావు ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు. గతంలో ఒకసారి ఇన్‌చార్జిగా పనిచేసిన గోవిందరావు సమయపాలన పాటించని ఉద్యోగులకు షోకాజ్ ఇచ్చి గట్టిగా హెచ్చరించారు. ఇదిలావుండగా కార్యాలయంలో కొందరు ఉద్యోగులపై గతంలో ఒకసారి ఫిర్యాదులు వస్తే... తూతూమంత్రంగా విచారణ జరిపారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉద్యోగం ఉంటుందో.. ఊడుతుందో.!



» తీవ్ర ఆందోళనలో విధులు నిర్వర్తిస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు
» ఈ నెలాఖరుతో ముగుస్తున్న పలు కాంట్రాక్టులు
» నూతన కాంట్రాక్టులకు టెండర్లు పిలవని ఉక్కు యాజమాన్యం
» ఆయా విభాగాల్లో పని చేస్తున్న 544 మంది కార్మికుల భవితవ్యం ప్రశ్నార్థకం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో తీవ్ర ఆందోళనతో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగం ఉంటుందో.. ఏ క్షణాన ఊడుతుందోనన్న వార్త వినాల్సి వస్తుందోనని సతమతమవుతూ పనులు చేస్తున్నామని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటులోని కొన్ని విభాగాల్లో కాంట్రాక్టు గడువు ముగియనుండడం, ఆపై నూతన టెండర్లు పిలవకపోవడంతో ఎప్పుడు ఎలాంటి సమాచారం వినాల్సి వస్తుందోనని భీతిల్లుతున్నామని వాపోతున్నారు. ప్లాంటులో ఇంజనీరింగ్ షాప్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, స్క్రాప్, బ్లాస్ట్ ఫర్నేస్, సింటర్ ప్లాంట్, ఎస్ఎంఎస్, ఈఎండీ, ఎల్ఎంఎంఎం విభాగాల్లోని కొన్ని కాంట్రాక్టులు ఈ నెలలో ముగియనున్నాయి. నూతన టెండర్లను ఉక్కు యాజమాన్యం ఇప్పటివరకు పిలవలేదు. ఆయా విభాగాల్లో మొత్తం 544 మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులే వీరికి జీతాలు చెల్లిస్తున్నారు. అయితే వీరి వర్క్ కాలపరిమితి ముగియనుండడంతో ఇకపై సదరు కాంట్రాక్టు సంస్థ అక్కడ నుంచి తప్పుకుంటుంది. దీంతో ఆ 544 మంది కార్మికులకు పనిలేకుండా పోతుంది. ఇందుకు సంబంధించి ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఇప్పటికే ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల ప్లాంటులో సుమారు 4,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించడం.. కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగడంతో యాజమాన్యం వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా కాంట్రాక్టర్ల కోసం టెండర్లు పిలవకపోవడంతో వారి ఆధ్వర్యంలో పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. కర్మాగారంలో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని, టెండర్లు పూర్తయిన వాటికి కొత్తగా టెండర్లను పిలిచి పనులు యథావిధిగా సాగించాలని, లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 'పల్లా'కు వినతి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ ఉక్కు కాంట్రాక్టు కార్మిక యూనియన్ నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గురువారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కొంతమంది కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలలుగా, మరికొందరికి రెండు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని వివరించారు. అలాగే చాలామంది కార్మికులు పనులు కోల్పోయి రోడ్డున పడ్డారని, మరికొంతమందిని తొలగించేందుకు ఉక్కు యాజమాన్యం యత్నిస్తుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కాంట్రాక్టు కార్మికులను న్యాయం చేయాలని వేడుకున్నారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కూరందాసు వంశీకృష్ణ, జి.శ్రీనివాసరావు, చట్టి నరసింగరావు, రామిరెడ్డి, గొడ్డి రమణ, తదితరులు ఉన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ నాయకులు



లబ్ధిదారులతో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.గణబాబు, తదితరులు

సంప్రదాయ వృత్తులను గౌరవించాలి: ఎంపీ శ్రీభరత్

ఆర్పీపేట (కంచరపాలెం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వృత్తులను ప్రతిఒక్కరూ గౌరవించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. 57వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్‌లో ఉన్న కల్యాణ మండపంలో జీవీఎంసీ ఐదు, ఎనిమిది జోన్‌లకు చెందిన పలువురికి ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులు, కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం 'విశ్వకర్మ' పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన 14 రకాల కులవృత్తుల వారికి శిక్షణతో పాటు ఉచిత పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కులవృత్తుల వారికి లోన్‌ల సదుపాయం కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, జీవీఎంసీ అధికారులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చేతివృత్తి కళాకారులకు వరం 'విశ్వకర్మ': టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'

గాజువాక: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం చేతివృత్తి కళాకారులకు వరం వంటిదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో ఈ పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వడ్రంగి, కుమ్మరి, తాపీమేస్త్రీలు, పువ్వులు అమ్ముకునేవారు, బొమ్మలు తయారుచేసేవారు, వలలు అల్లేవారు, చెప్పులు కుట్టేవారు.. ఇలా 18 రకాల చేతివృత్తిదారులకు వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు పనిముట్ల కోసం రూ.15 వేల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రా కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న చేతివృత్తిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, రాజాన రామారావు, పల్లా శ్రీనివాసరావు, జెడ్పీ శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి: చేతివృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ వృత్తులను ఆదరిస్తుందని, చేతివృత్తుల వారికి రుణాలు,మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.విశ్వాకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో జెడ్పీ హైమవతి,బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు,మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు.జనసేన నేతలు సేనాపతి సోమశేఖర్ పిన్నింటి వరలక్ష్మి,కరణం కనకరావు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పంచకర్ల

'గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి'

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సరిపల్లిలో జరిగిన కార్యక్రమంలో పంచకర్ల మాట్లాడుతూ రానున్న రోజుల్లో అంచెలంచెలుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్రం సహకారంతో పల్లెలను అభివృద్ధి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతకుముందు సరిపల్లి, జంగాలిపాలెం, పెదగాడి, ఊరిపోతులపాలెం, రాజయ్యపేటలో గ్రామాల్లో వర్షంలో తడుస్తూనే ఎమ్మెల్యే పర్యటించి రూ.2.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు గొర్లె రామకృష్ణ, జి.నరసింగరావు, కె.లావణ్య త్రినాథ్, ఎంపీటీసీ జి.రమణ, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

వేపగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం సబ్ స్టేషన్, ఎల్‌వీ నగర్ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు వేపగుంట ఏఈ వెంకటరమణ తెలిపారు. ఈ కారణంగా పురుషోత్తపురం, గోకులం కాలనీ, పురుషోత్తపురం కాలనీ, ఎన్ఏడీ కాలనీ, ఎల్‌బీ నగర్, సేనాతివానిపాలెం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్** : సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం** : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక** : శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో**: గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్**: శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర** : మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 40, టమాటా 48,వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 28,కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 32, క్యారెట్ 60, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబాటి 44,ముల్లంగి 30,నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 30,దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, క్యాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28,చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 75, కొండ ఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260



భారీ వర్షానికి నిర్మానుష్యంగా ఉన్న పెదగంట్యాడ జంక్షన్



64వ వార్డు పరిధి కొంగపాలెం కొండపై కుప్పకూలిన రేకుల షెడ్డు

వాయుగుండం ప్రభావంతో వర్షాలు

» జలమయమైన లోతట్టు ప్రాంతాలు
» ఛిద్రంగా మారిన రహదారులు
» కొంగపాలెం కొండపై కూలిన రేకుల షెడ్డు: ఒకరికి తీవ్ర గాయాలు

పెదగంట్యాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లోని రోడ్లు, కాలువలు ఏకమవుతున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు నీరు రహదారులపై పారుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్కోసారి కుండపోతగా వర్షం కురవడంతో వీధి రోడ్లు, డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి.పల్లపు ప్రాంతాల్లోని రహదారులపై పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. పలు కాలువలు పూడికలతో నిండిపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. పెదగంట్యాడ పారిశ్రామిక వాడ, హెచ్‌బీ కాలనీ, బాలచెరువు కాలనీ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి అధికంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానాపాట్లు పడ్డారు.

కూలిన రేకుల షెడ్డు: ఒకరికి తీవ్ర గాయాలు

భారీ వర్షాలకు 64వ వార్డు పరిధి కొంగపాలెం కొండపై ఓ రేకుల షెడ్డు కూలిపోయింది. నక్కా రెడ్డి అనే వ్యక్తి రేకుల షెడ్డులో కుటుంబంతో నివసిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతం పూర్తిగా తడిచిపోవడంతో గురువారం ఉదయం ఒక్కసారిగా షెడ్డు కూలిపోయింది. ఆ సమయంలో రెడ్డి ఇంట్లోనే ఉండడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను గాజువాకలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా కూలిన రేకుల షెడ్డును అధికారులు పరిశీలించి, ఆ కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

చెరువులను తలపించిన రహదారులు

కూర్మన్నపాలెం: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో పలు ప్రాంతాల్లో గురువారం వేకువజాము నుంచి వర్షం కురుస్తుంది. మధ్య మధ్యలో కాసేపు తెరిపిచ్చినా మళ్లీ కాసేపటికే వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

స్తంభించిన జనజీవనం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. అత్యవసరం అయితే తప్పా ప్రజలు బయటకు రావడానికి సాహసించలేదు. జోరువాన వల్ల హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు కార్మికులకు పనిలేకుండా పోయింది. ఈ కార్మికులందరూ సంస్థ బయటే పనులు చేయాల్సి ఉండడం.. హెచ్‌పీసీఎల్ పరిసరాలు బురదమయంగా మారడంతో సంబంధిత కాంట్రాక్టర్లు కూడా కార్మికులను పనులకు పిలవలేదు. హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులతో పాటు షట్‌డౌన్ పనులకు వర్షం వల్ల ఆటంకం కలిగింది. మల్కాపురం కూడలి, హెచ్‌పీసీఎల్ సీ-గేటు, ఇండియన్ కోస్టుగార్డు ఏరియా, నేవీ ప్రధాన కార్యాలయం వద్ద వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది.

చిత్తడిగా మారిన లోతట్టు ప్రాంతాలు

గోపాలపట్నం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోపాలపట్నం శివారులోని లోతట్టు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచి కురిసిన వానలకు 89వ వార్డు పరిధి కొత్తపాలెం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ఇప్పటికే దుర్భరంగా మారాయి. లోతట్టు ప్రాంతాల నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో చాలామంది రైతులు ఈ ఏడాది వరినాట్లు వేయడం మానుకున్నారు. వర్షాలకు గోపాలపట్నం, కొత్తపాలెం, తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు మరింత చిత్తడిగా మారాయి.



బురదమయంగా మారిన గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం

68, 69 వార్డుల్లో..

అక్కిరెడ్డిపాలెం: వర్షాలకు 68, 69 వార్డుల పరిధిల్లో పలు ప్రధాన రహదారులు చెరువులుగా మారాయి. జాతీయ రహదారి నుంచి షీలానగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు చెరువును తలపిస్తుండడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నాతయ్యపాలెం నుంచి షీలానగర్‌కు వచ్చే చెరువు రహదారిలో, ఆటోనగర్ నుంచి తుంగ్లాం కాలనీలోకి వచ్చే రోడ్డు మలుపులో వున్న గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఛిద్రమైన రహదారితో తిప్పలు

పెందుర్తి-రూరల్: వర్షాలకు 95వ వార్డు పరిధి లక్ష్మీపురం నుంచి పినగాడి కూడలికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవు గల ఈ రహదారిలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. లక్ష్మీపురం మీ-సేవా కేంద్రం సమీపంలోని రహదారి మరీ దుర్భరంగా దర్శనమిస్తోంది. భారీ వర్షాల సమయంలో రాముడి చెరువు నీరు ఈ రహదారిపై నుంచే ప్రవహిస్తుంటుంది. దీంతో రోడ్డంతా గోతులతో ఛిద్రంగా తయారైంది. గోతులతో నిండిన ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రిపూట తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి రాముడి చెరువు నీటి ప్రవాహానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఛిద్రంగా మారిన లక్ష్మీపురం నుంచి పినగాడి వెళ్లే రోడ్డు

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్‌కు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, పాఠశాలకు జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డు దక్కడం, జిల్లా స్థాయి నృత్య పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమానికి పల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడరు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.మన్నాజీని అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, అరుణ, షేక్ ప్రసాద్, శ్రీనివాస్, రామశేషు, నరసింగరావు, టీడీపీ నాయకులు విజయరామరాజు, వి.రాంబాబు, ఎస్.పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.



రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

'మేహాద్రిగెడ్డ' నుంచి నీరు విడుదల

గోపాలపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో గురువారం సాయంత్రం జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 59.8 అడుగులకు చేరింది. దీంతో రిజర్వాయర్ రెండో నంబర్ గేటును ఎత్తి 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా రిజర్వాయర్‌ను నీటిపారుదల శాఖ డీఈఈ జె.స్వామినాయుడు, ఏఈఈ ఆర్.విజయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బరాజు పరిశీలించారు. ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి నీటిమట్టం 58.5 అడుగులకు చేరగానే రిజర్వాయర్ గేటును దించాలని సిబ్బందికి స్వామినాయుడు ఆదేశించారు.

ప్రీపెయిడ్ ట్యాక్సీల్లో ప్రయాణం సురక్షితం

» సీపీ శంఖబ్రత బాగ్చి » ఎయిర్‌పోర్టులో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసు ప్రారంభం

గోపాలపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):విమానాశ్రయంలో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసును వినియోగించుకోవడం వల్ల ప్రయాణికులు సురక్షితంగా, భద్రంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవచ్చని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రీపెయిడ్ ట్యాక్సీ నడిపే డ్రైవర్‌కు సంబంధించిన డేటా అంతా పోలీసుల వద్ద ఉంటుందని.. తద్వారా ప్రయాణికులు నిశ్చింతగా ప్రయాణాలు సాగించవచ్చని పేర్కొన్నారు. విమానాశ్రయ డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, విమానాశ్రయ సిబ్బంది, ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, రాజారెడ్డి, తదితరులు

టగ్ నిర్మాణానికి హెచ్ఎస్ఎల్‌తో పోర్టు ట్రస్టు ఒప్పందం

మల్కాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) 60టీ బొల్లార్డ్ టగ్ నిర్మాణం కోసం విశాఖ పోర్టు ట్రస్టుతో గురువారం ఒప్పందం చేసుకుంది. ఈ టగ్‌ను ఐఆర్ఎస్ క్లాస్‌తో అంతర్గతంగా రూపొందించనున్నారు. ఇది 60 టన్నుల బరువు వరకు లాగుతుంది. దీని నిర్మాణానికి 18 నెలల సమయం పడుతుంది. భారతీయ ఓడరేవుల్లో హార్బర్ టోయింగ్, షిప్ అసిస్ట్ సామర్థ్యాలను పెంపొందించడం, ఆత్మ నిర్భర్ భారత్, మారిటైమ్ విజన్-2030 దిశగా షిప్‌యార్డు ముందుకు సాగుతుందని హెచ్ఎస్ఎల్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డు, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీలక్ష్మి, పద్మావతి సమేతంగా శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

స్టీల్‌ప్లాంట్ పూర్వ వైభవం కోసం చండీ హోమం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవం, అభివృద్ధి కోసం ప్లాంట్ సత్యసాయి సేవా సమితి, సప్తరుషి వేద పాఠశాల ఆధ్వర్యంలో గురువారం వేద పండితులచే చండీ హోమం నిర్వహించారు. ప్రముఖ గురువు ఎం.మాధవశర్మ నేతృత్వంలో హోమం జరిపారు. ప్లాంటుకు, విధులు నిర్వర్తించే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతూ హోమం చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎస్ నాయుడు, స్టీల్‌ప్లాంట్ సమితి కన్వీనర్ రామకృష్ణ, ఉక్కు ఫైనాన్స్ విభాగం సీజీఎం వి.శాంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి బీఆర్టీఎస్ రోడ్డును సరి చేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నుంచి వేపగుంట వరకు ఉన్న బీఆర్టీఎస్ రహదారిపై యమపాశాల్లా విద్యుత్ తీగలు, ప్రాణాంతకంగా డివైడర్లు ఉండడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ప్రమాదాల నిలయంగా పెందుర్తి బీఆర్టీఎస్ రోడ్డు' అనే శీర్షికతో కథనం ప్రచురితమవ్వడంతో ట్రాఫిక్ పోలీసులు ,జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది స్పందించారు.ఈ మేరకు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు ఎస్ఐ నరసింగరాజు, జీవీఎంసీ వర్క్స్ ఇంజనీర్ శివ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. సెంటర్ రోడ్డుపై ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. అలాగే రహదారిపై విరిగిపడి ప్రాణాంతకంగా మారిన డివైడర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టారు.



సెంటర్ రోడ్డుపై విద్యుత్ తీగలను సరిచేస్తున్న దృశ్యం

మండల సర్వేయర్‌గా శ్రీరామూర్తి



పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ సర్వేయర్‌గా శ్రీరామూర్తి నియమితులయ్యారు. గురువారం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు జాయినింగ్ రిపోర్ట్ అందజేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఇప్పటివరకు పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మండల సర్వేయర్ కావలెను' శీర్షికతో కథనం ప్రచురితమైన ఒకరోజు వ్యవధిలోనే సర్వేయర్ పోస్టు భర్తీ కావడం గమనార్హం.

కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గంకల పర్యటన

కంచరపాలెం, అక్టోబరు 17 : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో పలు చోట్ల కాలువలు, గెడ్డలు కూలిపోయాయి. ఈ నేపథ్యంలో వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు గురువారం రాంజీ ఎస్టేట్ బాపూజీ నగర్, పల్నాటి కాలనీ, శివలింగపురం, నీలకంఠ నగర్ గ్రామాల్లో పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండను ఆనుకుని ఉన్న ఇళ్లను పరిశీలించి అప్రమత్తం చేశారు.పర్యటనలో గుర్తించిన సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో త్వరలోనే రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 17 : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, సాయిబాబా ఆలయం పరిధి, రామచంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం

సీతమ్మధార, అక్టోబరు 17 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం లాంసం ఆక్సిజన్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 లక్షల చెక్‌ను ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజుకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



నాలుగు లేన్ల రహదారిపై నిలిచిన నీరు

అక్కయ్యపాలెం, అక్టోబరు 17 : నగరంలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు, నాలుగు లేన్ల రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది.

తరాలు గడిచినా రూపుమారని రోడ్డు

» బర్మా క్యాంపు వాసులకు మట్టి రోడ్డు గతే.. » మరమ్మతుకు నోచుకోని పరిస్థితి » వర్షం వస్తే తప్పని ఇబ్బందులు

నగరంలోని పలు చోట్ల రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడి ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో గోతులమయంగా మారాయి. ఆక్రమణలు వంటి కారణాలతో రహదారులు కుచించుకుపోయాయి. ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

మాధవధార, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 49వ వార్డులోని బర్మాక్యాంప్ ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న రైల్వే లే అవుట్, మాణిక్యాంబ కాలనీలకు వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రహదారులపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దారి మధ్యలో అనధికార కట్టడాలు, ఆక్రమిత పాకలు ఉన్నాయన్న కారణంగా ఈ దారికి అటు ఇటు తారు రోడ్డు వేసినా ఈ



గోతులమయంగా తయారైన మట్టి రోడ్డు

భాగాన్ని మాత్రం వదిలేశారు. దీంతో ఈ మట్టి రోడ్డు గోతులతో మిగిలిపోయింది.

గతేడాది స్థానిక కార్పొరేటరు శంకరరావు ఇక్కడి పాకల్లో నివసించే వారికి ప్రత్యామ్నాయ స్థలాన్నిచూపించి, పక్కా దారికి మార్గం సుగమం చేస్తానని ప్రకటించారు. మట్టి రోడ్డులో అడ్డుగా ఉన్న పాకలైతే, కొత్త ప్రత్యామ్నాయ చోటుకి తరలిపోయాయి. వారు అక్కడ ఇళ్లు కూడా కట్టుకుని ఉంటున్నారు. కానీ, ఈ రోడ్డుకు మాత్రం మోక్షం రావడం లేదు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వార్డు పర్యటనలు, గుడ్ మార్నింగ్ వాకింగ్ అంటూ తరచూ వార్డులో కలియ తిరిగిన కార్పొరేటర్ శంకరరావు ప్రస్తుతం మొహం చాటేశారంటూ స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టి రోడ్డు సమస్య పరిష్కారంపై ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అంటున్నారు.

వర్షం పడితే ప్రయాణం మరింత నరకంగా మారుతోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఫైర్ స్టేషన్ మలుపు రోడ్డులో సీసీ రోడ్డు గానో, తారు రోడ్డుగానో నవీకరించాలని కోరుతున్నారు.

కుటుంబ సభ్యులకు రోగుల అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 17 : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న బిహార్‌కు చెందిన మానసిక రోగి అర్జున్ మెహత్‌ను, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ రామ్‌ను శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అయిదేళ్ల క్రితం అర్జున్ తండ్రి మృతి చెందడంతో మానసికంగా ఇబ్బందితో ఎక్కడెక్కడో తిరిగి విశాఖకు వచ్చాడన్నారు. ఆయన వద్ద సేకరించిన వివరాలతో బిహార్ దర్భంగా జిల్లాలోని శివదాస్‌పూర్ గ్రామంలోని సోదరుడి కుమారుడు మిత్లేష్ మహత్‌కు ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించారన్నారు. అలాగే మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతున్న ప్రదీప్‌రామ్ తన ఊరు నుంచి ఇల్లు వదిలి వచ్చేశాడన్నారు. అతన్ని కూడా తన చిన్నాన్న ఉమేష్ రామ్‌కి అప్పగించారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన

మాధవధార, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వ వార్డు మాధవధార జీవీఎంసీ కల్యాణ మండపంలో గురువారం విశ్వకర్మ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి నార్త్ ఎమ్మెల్యే కుమార్తె శ్యామల దీపిక,జీవీఎంసీ యూసీడీ పీడీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జడ్సీ రాము తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అంతర్ కళాశాలల కబడ్డీ విజేత సమత కళాశాల

» ద్వితీయ, తృతీయ స్థానాల్లో యలమంచిలి ప్రభుత్వ కళాశాల, డాక్టర్ కృష్ణా కాలేజి

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ టోర్నీలో సమతా డిగ్రీ కాలేజీ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజి, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజి ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలవగా, డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కాలేజి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాలులో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సమతా డిగ్రీకాలేజి 43-14 పాయింట్ల తేడాతో యలమంచిలి ప్రభుత్వ కాలేజి విజయం సాధించగా, మూడో స్థానానికి జరిగిన మ్యాచ్‌లో డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ 21-19 పాయింట్ల తేడాతో బుల్లయ్య కాలేజీపై గెలుపొందింది.

టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు



ప్రొఫెసర్ విజయ్‌మోహన్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న సమతా కళాశాల జట్టు

కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎరుకుమాంబ ఆలయ వార్షికోత్సవం

దొండపర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దొండపర్తి గ్రామ దేవత ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, గౌరవ అతిథిగా 27వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని వీరారావు బుజ్జి హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే ఉదయం నుంచి ఆలయం వద్ద లక్షీగణపతి హోమం, ప్రాతఃకాల అర్చనలు, అన్న కుంభరాశి పూజ, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 27వ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీశివప్రసాద్, బీజేపీ 42వ వార్డు అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, నాయకులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, ఎంఎల్ఎన్ రావు, గంగరాజు, వెంకట సత్యనారాయణ, గురునాథ్‌రెడ్డి, బసనబోయిన సుజాత, కుంతీదేవి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరిస్తే సహించం

ఇంటక్ అధ్యక్షుడు గొర్లె చందు



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న చందు

అక్కయ్యపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరిస్తే సహించేది లేదని ఇంటక్ అధ్యక్షుడు గొర్లె చందు హెచ్చరించారు. గత కొన్ని రోజుల నుంచి ఆస్పత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు గురువారానికి 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ పోర్టులో సుమారు 40 వేల మంది కార్మికులు, విశ్రాంత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారన్నారు. పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించకుండా పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలని కోరారు.ప్రభుత్వం, యాజమాన్యం పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించేందుకు టెండర్లు పిలుస్తోందని, దానికి వ్యతిరేకంగా పోర్టులో ఉన్న ఆరు ఫెడరేషన్లు రిలే నిరాహార దీక్ష ద్వారా ఉద్యమించి ప్రైవేటీకరణను అడ్డుకోనేందుకు నిర్ణయించాయన్నారు. గతంలో పోర్టులో పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వారికి ఇచ్చి ఏ ఒక్కటి కూడా సత్ఫలితాలు పొందలేదని గుర్తు చేశారు.లీజుల ద్వారా ప్రైవేటు వారికిచ్చిన పోర్టు స్టేడియం, కల్యాణమండపాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముంబైలో పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వారికిచ్చినా కార్మికులకు ఎటువంటి సేవలు అందలేదని, ఈ విషయంపై కోర్టుకు వెళ్ళారన్నారు. ఈ దీక్షలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి రవి, సిటూ ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, హెచ్ఎంఎస్ మంగయ్యనాయుడు, ఎన్‌పీటీఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, రమణ, సూర్యనారాయణ, రవి, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వాల్తేరు రైల్వే ఎలక్ట్రికల్ లోకోషెడ్ అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 17, ఆంధ్రజ్యోతి : రైల్వే ప్రాంగణాలలో పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ వాల్తేరు రైల్వే ఎలక్ట్రికల్ లోకోషెడ్ గురువారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించింది. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బల్లా షణ్ముఖరావు, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ముమ్మన అశోక్‌కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రంతి దేవ్‌తో పాటు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ఎలక్ట్రికల్ లోకోషెడ్, చుట్టు పక్కల కార్యాలయాలతో పాటు రైల్వే కాలనీలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఈఈ షణ్ముఖరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణ కల్పనకు పరిశుభ్రత, పారిశుద్ధ్యం పాటించడం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి కేరళ ఆయుర్వేద వైద్య శిబిరం

డాబాగార్డెన్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అవుట్ గేట్ ఎదురుగా ఉన్న వైద్య రాజ ఔషధ శాలలో ఈనెల 20, 21 తేదీల్లో కేరళ ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చర్మ వ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, నడుము నొప్పి, సోరియాసిస్ వంటి సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. 22, 23 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్కు సమీపంలో రెండు రోజుల పాటు శిబిరం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 80080 00670, 76758 61446 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

ఐఏఆర్ఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్య సమితి 79వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 24న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్) రూపొందించిన ప్రపంచ శాంతి పోస్టర్‌ను ఏయూ సోషల్ వర్క్ విభాగం అధిపతి డా. హరనాథ్, ఐఏఆర్ఎఫ్ ఛైర్మన్ నరవ ప్రకాశరావు గురువారం వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ ఐకాస ప్రపంచ శాంతి స్థాపనకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. సభ్య దేశాలు సమితి బలోపేతానికి సహకరించాలని చెప్పారు. ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 24న విద్యార్థులకు సమితి పనితీరు, కృషి అన్న అంశంపై వివిధ పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డా.గ్యానేశ్వరరబాబ్జీ, అప్పారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

జగదాంబ కూడలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 30వ వార్డు తాడివీధిలో రూ. 19 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవన సముదాయాలను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల కోసం సామాజిక భవనం నిర్మాణానికి కృషి చేసిన కార్పొరేటర్ అప్పలరత్నంను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న అంతర కళాశాలల గణిత పోటీలు

జ్ఞానాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈనెల 22న అంతర కళాశాలల గణిత పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా. సిస్టర్ షైజీ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో మేధో కౌశలం, అంతర్గత ప్రతిభను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగం అధ్యాపకురాలు సుజాత, జయలక్ష్మి, గౌరీశంకర్, పాల్గొన్నారు.

అవినీతి ఖజానా

» బిల్లులు అప్‌లోడ్‌కు డబ్బులు డిమాండ్
» పలువురు ఉద్యోగులపై సీఎం పేషీకి ఫిర్యాదు
» విచారణకు ఆదేశాలు
» ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల
» వాంగ్మూలం తీసుకున్న ఇన్‌చార్జి డీడీ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా కార్యాలయంలో కొంతమంది తీరు మారడం లేదు. కార్యాలయానికి వచ్చే ఉద్యోగుల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. దీనికితోడు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులు హెచ్చరించినా ఎటువంటి మార్పు కనిపించడం లేదు. తాజాగా ముగ్గురు ఉద్యోగులపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లడంతో విజయవాడలోని ఖజానా శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల నుంచి వచ్చే బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు సొమ్ములు తీసుకుంటున్నారని సీఎం కార్యాలయానికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిసింది.

గడచిన ఐదారేళ్లుగా సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగి భారీ అవినీతికి పాల్పడుతున్నారని సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఒక సబ్ ట్రెజరీ నుంచి సుమారు ఆరేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వచ్చిన సదరు ఉద్యోగి తరువాత ఇక్కడే ఉండిపోయేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. ఉద్యోగులకు రుణాలు మంజూరు, ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులు/అధికారుల జీతాలకు సంబంధించి సాంకేతిక అంశాలను పరిష్కారం, తదితర విధులు నిర్వహిస్తుంటారు.

సాధారణంగా ట్రెజరీలో పనిచేసే ఉద్యోగులు, అధికారుల జోలికి ఇతర శాఖల ఉద్యోగులు వెళ్లరు. జీతాలు, ఎరియర్స్ ఇతర బిల్లులు మంజూరులో ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయరు. అయితే ఈ పర్యాయం ఎవరి పేర్లు లేకుండా సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో గురువారం ఇన్‌చార్జి డీడీ గోవిందరావు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను పిలిచి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఫిర్యాదులో పేర్కొన్న శాఖలకు చెందిన డ్రాయింగ్ ఆఫీసర్లు, జీతాలు/ఎరియర్స్ బిల్లులు పెట్టే ఉద్యోగులతో కూడా మాట్లాడాలని ఆయన నిర్ణయించారు. కాగా జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల తీరు మారకపోవడంతో పది రోజుల క్రితం డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ సెలవులో వెళ్లిపోయారు. ప్రస్తుతం సీతమ్మధార సబ్‌ట్రెజరీ ఏటీవో గోవిందరావు ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు.

గతంలో ఒకసారి ఇన్‌చార్జిగా పనిచేసిన గోవిందరావు సమయపాలన పాటించని ఉద్యోగులకు షోకాజ్ ఇచ్చి గట్టిగా హెచ్చరించారు. ఇదిలావుండగా కార్యాలయంలో కొందరు ఉద్యోగులపై గతంలో ఒకసారి ఫిర్యాదులు వస్తే...తూతూమంత్రంగా విచారణ జరిపారనే ఆరోపణలు ఉన్నాయి.

మాజీ ఎంపీ ఎంవీవీకి షరతులతో ముందస్తు బెయిల్

హయగ్రీవ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ మాజీ ఎంపీ, వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. హయగ్రీవ భూముల వ్యవహారంలో అరిలోవ పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఎంవీవీతో పాటు బిల్డర్ గద్దె బ్రహ్మాజీ, చార్టెడ్ అకౌంటెంట్ జి.వెంకటేశ్వరావుకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. రూ.30 వేలతో ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. మూడు నెలల పాటు ప్రతీ నెల 1, 15వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. పరిధి దాటి వెళ్లాల్సి వస్తే ప్రయాణ వివరాలను దర్యాప్తు అధికారికి అందజేయాలని పేర్కొంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులను ప్రభావితం చేయడం, బెదిరించ కూడదని తేల్చిచెప్పింది. దిగువ కోర్టులో విచారణకు క్రమం తప్పకుండా హాజరుకావాలని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం తీర్పునిచ్చారు. ఎండాడ గ్రామ పరిధిలో వృద్ధాశ్రమం, అనాథాశ్రమం, వృద్ధులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి తాను తీసుకున్న 12.5 ఎకరాల భూమిని లాక్కునేందుకు ఎంవీవీ సత్యనారాయణ, ఆయన సన్నిహితుడు వెంకటేశ్వరరావు, బిల్డర్ బ్రహ్మాజీ పలు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారంటూ హయగ్రీవ కన్‌స్ట్రక్షన్స్ అధినేత జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరిలోవ పోలీసులు ఈ ఏడాది జూన్ 22న కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంవీవీ, ఆయన సన్నిహితులు వేర్వేరుగా పిటిషన్లు వేశారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయమూర్తి తాజాగా తీర్పునిచ్చారు.

స్టేషన్‌లో అపరిశుభ్రతపై డీసీపీ ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ

కంచరపాలెం, అక్టోబరు 17 : కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో అపరిశుభ్రతపై డీసీపీ-2 మేరీ ప్రశాంతి అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆమె స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోకి వచ్చిన ఆమెకు కోడి పుంజుల వ్యర్థాల దుర్వాసన రావడంతో ఒక్కసారిగా బయటకు వచ్చేశారు. అనంతరం ఆమె ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలిస్తుండగా సీఐ స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ పరిసరాలను ఈవిధంగానే ఉంచుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హనీ ట్రాప్ కేసు పురోగతిపై ఆరా తీశారు. కేసులో ఎటువంటి పురోగతి కనిపించకపోవడంతో సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైలులో గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ ఫరూక్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు సిబ్బందితో గురువారం తనిఖీ చేస్తుండగా కర్ణాటకకు చెందిన బరమప్ప బసవరాజ్ వడ్డర్‌వద్ద రూ.90 వేలు విలువ చేసే 18 కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా నిందితునికి రిమాండ్ విధించారని తెలిపారు.

మహారాణిపేటలో పారిశుధ్య లోపం

మహారాణిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహారాణిపేట ప్రధాన కూడలిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. నగరంలో మహారాణిపేట 29, 30 వార్డులు అత్యంత కీలకమైనవి. జిల్లా ముఖ్య కార్యాలయాలు, ఆసుపత్రులు ఉన్నాయి. రోజూ వేలాది మంది సంచరిస్తుంటారు. అలాంటి ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఆంథోనీ నగర్, అంగటి దిబ్బ, జిల్లా పరిషత్ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్‌లో పారిశుధ్యం తీరుకు ఈ పక్క చిత్రం నిదర్శనం. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడుతూ ఉండటంతో దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విది నిర్వహణలో అలసత్వం చూపడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షించేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు



ప్రధాన కూడలిలో పారిశుధ్యం తీరిది..

ట్రాఫిక్ పద్మవ్యూహం

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం వరకూ రహదారిపై 12 ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఆ ప్రకారం కూర్మన్నపాలెం, గాజువాక, షీలానగర్, మురళీనగర్, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక, ఎండాడ, కారు షెడ్ జంక్షన్, కొమ్మాది జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రణాళికలు ఉన్నాయి. వీటిని మూడు డిజైన్లతో రూపొందించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో + ఆకారంలో, మూడు రోడ్ల జంక్షన్‌లో 'వై' ఆకారంలో, రెండు రోడ్ల జంక్షన్‌లో 'టి' ఆకారంలో ఫ్లైఓవర్లు వేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రతిపాదించారు. అవసరమైనచోట్ల అండర్ పాస్‌వేలు కూడా వేస్తామని చెప్పారు. ప్రస్తుతం పైన పేర్కొన్న జంక్షన్లను దాటి వెళ్లాలంటే కనీసం రెండు నుంచి నాలుగు నిమిషాల సమయం పడుతోంది. ఈ 12 జంక్షన్లలోనే అరగంట ఆగిపోవలసి వస్తోంది. ఫ్లైఓవర్లు నిర్మించకపోతే భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది.

మెట్రో ఇప్పట్లో అసాధ్యం

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే మెట్రో రైలు ప్రాజెక్టుకు శ్రీకారం చేపట్టారు. పదేళ్లయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఆ ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు అవసరం. పెట్టుబడికి తగిన రాబడి వచ్చే అవకాశాలు తక్కువ. అటువంటి ప్రాజెక్టుతో ముడిపెట్టి...ఎలివేటెడ్ కారిడార్ అంటూ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని పక్కనపెట్టడం సమంజసమేనా?...అనేది పునరాలోచన చేయాలి. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా విశాఖపట్నం నుంచి అక్కడకు ఏ సమస్య లేకుండా సాఫీగా వెళ్లిపోయే ఏర్పాట్లు చేయాలి. అది ఫ్లైఓవర్ల ద్వారా సాధ్యమవుతుందా? లేదా కోస్టల్ కారిడార్ ద్వారా వీలవుతుందా?...అనేది ప్రభుత్వమే నిర్ణయించుకొని తక్షణం పనులు చేపట్టాలి.

కార్పొరేటర్ల కలెక్షన్!

... 5వ పేజీ తరువాయి

అధ్యయన యాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మేయర్ ముందస్తు అనుమతి ఇవ్వడంతో ఒక్కో కార్పొరేటర్‌కు అధ్యయన యాత్రకు రూ.1.2 లక్షలు ఖర్చుతో అన్ని ఏర్పాట్లుచేసేందుకు షార్ట్ టెండర్ పిలిచారు.

కాంట్రాక్టర్లకు టార్గెట్‌లు:

కేవలం వంద మంది కార్పొరేటర్లకు అయ్యే ఖర్చులను మాత్రమే లెక్కించి జీవీఎంసీ నిధులు వెచ్చించేలా టెండర్ పిలిచారు. కానీ మహిళా కార్పొరేటర్లకు తోడు వారి కుటుంబసభ్యుల్లో ఒకరు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. అందుకు అదనంగా మరో రూ.70 లక్షల వరకూ ఖర్చవుతుంది. అలాగే ఆయా నగరాలకు వెళ్లినప్పుడు అక్కడ పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రముఖక్షేత్రాలను సందర్శించేందుకు కార్పొరేటర్లు సొంతంగా ఖర్చులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని కార్పొరేటర్లందరికీ సర్దుబాటు చేస్తామని కూటమికి చెందిన కార్పొరేటర్లు కొందరు హామీ ఇచ్చినట్టు సమాచారం. దీంతో దాదాపు రూ.1.5 కోట్లు వరకూ అదనంగా అవసరం అవుతుండడంతో ఆ మొత్తాన్ని సమకూర్చాలంటూ కొంతమంది కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీ హయాంలో ఇదే పరిస్థితి ఎదుర్కొన్నామని, ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అదే ధోరణి కొనసాగుతోందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీలో తప్పితే రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్లలో ఎక్కడా కార్పొరేటర్లంతా మూకుమ్మడికిగా అధ్యయన యాత్రలకు వెళ్లిన దాఖలాలు లేవు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌లో రెండేళ్ల కిందట ఇలాంటి ప్రతిపాదన చేస్తే, తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో వెనక్కితగ్గారు. అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రాజెక్టులను పరిశీలించదలచుకుంటే మేయర్, డిప్యూటీ మేయర్లు, అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లతోపాటు అధికారులు వెళ్లవచ్చునని, ఇలా అందరూ కలిసి వెళ్లడమేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అప్పన్న ఆలయంలో వర్షం నీరు లీకు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో వర్షం నీరు లీకవుతుండడంతో భక్తులు, సిబ్బంది ఇబ్బంది పడుతు న్నారు. గురువారం కురిసిన వర్షానికి ఆలయంలో ఆస్థాన మండపం, నీలాద్రి గుమ్మం, దక్షిణ ద్వారం, ఇలా అనేక ప్రాంతాల్లో వర్షం నీరు కారింది. దీంతో భక్తులు, సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. వర్షం నీరు లీకవ్వకుండా దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించి పలుమార్లు మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంక్షోభంలో ఇటుకల పరిశ్రమ

- నిలిచిన భవన నిర్మాణాలు
- వెంటాడుతున్న ఇసుక కొరత
- వీటికితోడు వర్షాల ప్రభావం
- బట్టీల్లో పేరుకుపోయిన నిల్వలు
- అమ్మకాలు లేక నష్టాల బాటలో యజమానులు


మద్ది గ్రామంలో ఇటుక బట్టీ

పద్మనాభం (రూరల్) అక్టోబరు 17 : ఇటుక పరిశ్రమకు గడ్డు కాలం నెలకొంది. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇటుకలకు డిమాండ్ తగ్గింది. దీంతో ఇటుక తయారీ తక్కువగా చేసినా అమ్మకాలు లేక భారీగా నిల్వలు పేరుకుపోయాయి. మద్ది, బోని, పాండ్రంగి, అనంతవరం, తదితర గ్రామాల్లో దశాబ్దాల కిందట వందకు పైగా ఇటుక బట్టీలుండేవి. క్రమేపీ వివిధ కారణాలతో తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం 90కి లోపు ఉన్నాయి. సాధారణంగా ఏటా రూ. 20 కోట్లకు పైగా విక్రయాలు సాగేవి. ఈఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూలీలు ముందగానే వెళ్లిపోవడంతో సుమారు సగానికి ఉత్పత్తి పడిపోయింది. నాలుగైదు నెలలుగా రూ. 2 కోట్ల ఇటుకలు కూడా అమ్మకాలు సాగలేదని బట్టీల యజమానులు వాపోతున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడం, ఇసుక ఇంకా పూర్తిస్థాయిలో లభ్యం కాకపోవడంతో భవన నిర్మాణాలు సాగడం లేదు. దీంతో ఇటుకల అమ్మకాలపై ప్రభావం పడింది. వీటి తయారీ కూడా తగ్గిపోయింది. అప్పు చేసి ఇటుకలను తయారు చేయడంతో నిల్వలు పేరుకుపోవడంతో పెట్టుబడులకు వడ్డీలకు పెరిగి మరింత ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ధర తగ్గించి కూడా అమ్మకాలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఇటుక తయారీకి వినియోగించే ఊక, పొట్టు బూడిద ధరలు భారీగా పెరగడంతో బట్టీల నిర్వాహణ భారీగా పెరిగింది. గతంలో బూడిద రూ. 5 వేలు ఉండగా, ప్రస్తుతం రూ. 9 వేలకు, టన్ను రూ. 1500 ఉన్న వంట కలప రూ. 3 వేలకు పెరిగింది. వీటన్నింటికీ మించి భూమి శిస్తు రేట్లు ఆకాశాన్నంటాయి. కూలీల ఖర్చు కూడా బాగా పెరడంతో ఒక్కో ఇటుక తయారీకి రూ. 4 నుంచి రూ 5.50 పైసలు ఖర్చవుతున్నట్టు యజమానులు తెలిపారు. ఇటుకకు డిమాండ్ లేకపోవడంతో పెట్టుబడి ధర లేకపోయినా నష్టానికి అమ్ముతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో బట్టీల నిర్వహణ మరింత కష్టంగా మరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్, 11 కేవీ వేములవలస పారిశ్రామిక ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేరెళ్లవలస, ఎగువపేట, బోయవీధి, ఎస్‌టీఎస్ ఏరియా, మెయిన్ రోడ్, జేపీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస గ్రామాలతో పాటు ఆర్డీవో కార్యాలయం, జీవీఎంసీ జోనల్ కార్యాలయం, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

శ్మశానవాటికలో తుప్పలు తొలగింపు

కొమ్మాది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం హిందూ శ్మశానవాటికలో పేరుకుపోయిన తుప్పలను జీవీఎంసీ సిబ్బంది గురువారం తొలగించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ శ్మశాన వాటికలో తుప్పల సమస్యపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన జోన్-2 జడ్సీ సింహాచలంకు తెలిపి, తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు శ్మశాన వాటికను శుభ్రం చేశారు. అలాగే వార్డు పరిధిలో వీధిలైట్ల సమస్యపై కూడా ఎమ్మెల్యే గంటా, జడ్సీతో మాట్లాడినట్టు దాసరి శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా అప్పన్న పౌర్ణమి తిరువీధి


తిరువీధిలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీయుజమాస శుక్లపక్ష పౌర్ణమి పురస్కరించుకుని అప్పన్న ఆలయంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద పఠనాలు, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ తిరువీధి జరిపారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 40, టమాటా 48, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 32, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 30, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260


అమనాంలో రోడ్డు నిర్మాణం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గ్రామీణ రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణ రహదారులకు కొత్త రూపు వస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన ముద్దాడపేట, రామునాయుడుపేట, అమనాం గ్రామాల్లో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుబంధ రహదారులు, లింకు రహదారుల వల్ల గ్రామాలకు సరికొత్త రూపు వస్తుందని చెప్పారు. అలాగే పాడైన రోడ్ల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు పాడైనా కనీసం మరమ్మతుకు కూడా నోచుకోలేదని, వాటిని తమ ప్రభుత్వ హయాంలో ఆధునీకరిస్తున్నామన్నారు. రోడ్లు, కాలువల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీడీఓ హనుమంతరావు, మండల టీడీపీ అధ్యక్షుడు రాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, నాయకులు గంటా నూకరాజు, బీజేపీ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లెల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కృష్ణాపురం సర్పంచ్ లక్ష్మీ భవాని, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీనాయుడు, టీడీపీ నాయకులు అచ్చిలనాయుడు, పైడినాయుడు పాల్గొన్నారు.


వరహగిరినగర్‌లో నీట మునిగిన ద్విచక్రవాహనాలు


సీతకొండ మలుపులో పడిన రాళ్లు


తెన్నేటి పార్కు ఎదురుగా రోడ్డుపై పడిన రాళ్లు

ఎండాడ, మధురవాడలో భారీ వర్షం

ఎండాడ/మధురవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ, మధురవాడలో గురువారం భారీ వర్షం కురిసింది.8వ వార్డులోని వరహగిరినగర్, దసపల్లా లేఅవుట్ ప్రాంతాల్లో వర్షానికి కాలువుల్లో నుంచి నీరు పొంగి


సింహగిరిపై దుకాణాల ముందు చేరిన నీరు

పొర్లింది. ఇక్కడి వినాయక ఆలయంలోకి నీరు ప్రవేశించింది. అలాగే దసపల్లా లేఅవుట్ రోడ్లపైకి నీరు చేరింది. సీతకొండ మలుపు ప్రాంతంలో కొండపై నుంచి రాళ్లు పడడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. 9వ వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ సిబ్బంది జేసీబీ సహాయంతో కొండ చరియలను తొలగించారు. పోలీసులు దారి మళ్లించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తెన్నేటీ పార్కు ఎదురుగా ఉన్న కొండపై నుంచి కూడా రాళ్లు పడ్డాయి. మధురవాడ కురిసిన భారీ వర్షానికి కారుషెడ్, మధురవాడ, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేడియం ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. సర్వీసు రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వాహనాలు బారులు తీరయడంతో


మధురవాడ : కారు షెడ్ వద్ద నిలిచిన ట్రాఫిక్

పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సర్వీసు రోడ్లు ఇరుగ్గా ఉండడం, అదే రహదారిలో రెండువైపులా వాహనాలు రాకపోకలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సింహాచలం : సింహగిరి బస్టాండ్‌లో కూడా వర్షం నీరు నిలిచిపోయింది. ఇక్కడ తాత్కాలిక దుకాణాలు పెట్టుకుని 40 మంది వ్యాపారాలు చేస్తున్నారు. బస్టాండ్‌లో వేసిన రోడ్డు ఎత్తు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా దుకాణాల ముందు నీరు నిలిచిపోతోంది. దీంతో భక్తులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.

'సింహాచలం'లో అంతర్గత బదిలీలపై విమర్శలు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దేవస్థానంలో మెరుగైన పరిపాలన కోసం ప్రతి మూడు నెలలకొకసారి అంతర్గత బదిలీలు చేస్తుంటారు. ఈమేరకు నెల రోజుల్లో రెండుసార్లు సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ ఆదేశాలు జారీ చేయటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలు వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్న అనుమానాలు కూడా రేకెత్తుతున్నాయి. అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కొందరికి అప్రాధాన్య శాఖలు కేటాయించాలన్నది రాజకీయ నేతల ఎత్తుగడ. అందులో భాగంగా దేవస్థానం ఈఓపై వత్తిడి తెచ్చి బదిలీలకు తెరతీశారు. ఈ క్రమంలో బదిలీలు కొందరికి ఖేదంగా, మరికొందరికి మోదంగా ఉన్నాయి. ముఖ్యంగా వైసీపీ పాలనలో పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు నిర్వహించిన కొందరు తమ వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో పీఆర్‌ఓ కార్యాలయంలో నియమించుకున్నారు. వారు ఇప్పటికీ కొనసాగుతుండగా, తాజాగా జరిపిన బదిలీల్లోనూ ఉన్నతాధికారిగా బదిలీ అయిన వ్యక్తి వైసీపీ ఎంప్లాయిస్ యూనియన్‌ను దేవస్థానంలో నడిపిన వారిలో ఒకరు కావడం ఆలయ సిబ్బందిలో చాలామందికి మింగుడు పడడం లేదు. మరో ఇద్దరు పర్యవేక్షణాధికారులకు వారి శాఖలు మార్చడం వారికి పనిష్మెంట్ కాకుండా వరంగా పరిణమించిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా దేవస్థానంలో జరిగిన అంతర్గత బదిలీలపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగినిపై లైంగిక వేధింపులు దారుణం


మాట్లాడుతున్న భాగం గోపాలరావు

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామంలో ఔట్ సోర్సింగ్ విధానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగినిపై అక్కడి ఉన్నతాధికారి లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు అన్నారు. గురువారం ఆయన పట్టణం లోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏవో, ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఎవరూ లేని సమయంలో అసభ్య పదజాలంతో మాట్లాడుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై బాధితురాలు 20 రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు బాధితురాలి ఫిర్యాదుపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు ఎం. వెంకట శివ, పి. ఈశ్వరరావు ఉన్నారు.

గ్రామాల్లో మెరుగైన పాలన : జెడ్పీ సీఈఓ


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి

పద్మనాభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిపాలనపై పంచాయతీ పాలకులు దృష్టి సారించాలని జడ్పీ సీఈఓ పి. నారాయణమూర్తి చెప్పారు.గురువారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పారిశుధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించాలని చెప్పారు. పంచాయతీల ఆదాయ వనరులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, భీమిలి ఎంపీడీఓలు ఎం. విజయకుమార్, హనుమంతరావు, ఏఓ జయ, ఉమ, ఈఓఆర్డీ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఆలయం లోపల లీకైన వర్షం నీరు

అప్పన్న ఆలయంలో వర్షం నీరు లీకు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో వర్షం నీరు లీకవుతుండడంతో భక్తులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి ఆలయంలో ఆస్థాన మండపం, నీలాద్రి గుమ్మం, దక్షిణ ద్వారం, ఇలా అనేక ప్రాంతాల్లో వర్షం నీరు కారింది. దీంతో భక్తులు, సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. వర్షం నీరు లీకవ్వకుండా దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించి పలుమార్లు మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ ఫలితం లేదు.

భీమిలి నేపథ్యంపై లఘు చిత్రం

దర్శకుడు పిసి ఆదిత్య


ఆదిత్య దంపతుల్ని సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమిలి చారిత్రక నేపథ్యం ఆధారంగా లఘు చిత్రం రూపొందించనున్నట్టు సినీ దర్శకుడు పిసి ఆదిత్య తెలిపారు. గురువారం రాత్రి చిన్న బజారులో ఉన్న శ్రీనివాస ఫంక్షన్‌హాలులో కళాసాహితి ఆధ్వర్యంలో ఆదిత్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘు చిత్రంలో స్థానిక కళాకారులకు అవకాశం కల్పిస్తానని చెప్పారు. కళాసాహితి అధ్యక్షుడు పి. రాజేంద్రప్రసాద్‌వర్మ మాట్లాడుతూ భీమిలి కళాకారులకు అవకాశం కల్పించడానికి ఎంతోమంది దర్శకులు ఉత్సాహం చూపిస్తున్నారని, త్వరలోనే కళాకారులకు స్వల్పకాలిక శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆదిత్య దంపతులను కళాసాహితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు కె. రామునాయుడు, కె.చంద్రమౌళీశ్వరరావు, సూర్యశ్రీనివాస్, అడిదం కిశోర్, మైలపల్లి షన్ముఖరావు, లక్ష్మణరావు, ఉసిరికల చంద్రావతి, రేఖ అప్పారావు, బాల, కనకల సన్యాసినాయుడు, ఎం. కోటయ్య, ఎ. సన్యాసిరాజు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి (భాండాగారం) నుంచి బంగారు సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక బంగారు పుష్పంతో పూజ చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నోటి కేన్సర్ పట్ల అప్రమత్తం

ఎండాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నోటి కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని గీతం డెంటల్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. వాల్తేరుకు చెందిన బి.రామారావుకు నాలుక వెనుక భాగంలో కేన్సర్ సోకడంతో గురువారం శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా జిమ్సర్‌కి చెందిన ఈఎన్‌టీ వైద్యులు యుగంధర్, రూపా గంట, సతీశ్, సౌజన్య మాట్లాడుతూ పొగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకం వల్ల నోటి కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి దంత వైద్య కళాశాలలో ప్రత్యేక విభాగం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎమ్మెస్సీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి తెలిపారు. గురువార ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21 వరకూ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. కోర్సులో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని,ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలన్నారు.

'బీఆర్‌టీఎస్ నిర్వాసితులను ఆదుకోవాలి'

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తొలిపావంచా నుంచి పాతఅడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. గురువారం ఆయన గాజువాకలో పల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన హామీల మేరకు బాధితులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.


సాగర్‌నగర్ : అంధ బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

చట్టాలపై అవగాహన అవసరం

సాగర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. గురువారం సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే నూర్జహాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సాధికార సేవా సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. గురువారం ఆమె అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. న్యాయమూర్తికి పాఠశాలకు సంబంధించిన అన్ని విషయాలను హెచ్‌ఎం ఇమంది పైడిరాజు తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


సాగర్‌నగర్ : వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

సాగర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమంద, తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు.

సింహాచలం :వాల్మీకి మహర్షి రచించిన పవిత్ర పురాణం రామాయణం గొప్ప రచన అని సింహాచల నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గేదెల సన్యాసిరావు అన్నారు. వాల్మీకి జయంతి పురస్కరించుకుని గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

'తహసీల్దార్ సుధాకర్‌నాయుడు సేవలు మరువలేం'

విశాలాక్షినగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో చినగదిలి రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సుధాకర్‌నాయుడు సేవలు మరువలేనివని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు నాయకులు, ఆయనతో పనిచేసిన సిబ్బంది పేర్కొన్నారు. సుధాకర్‌నాయుడు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమేరకు విశాలాక్షినగర్‌లోని ఆయన స్వగృహం వద్ద ఉంచిన భౌతికకాయాన్ని రెవెన్యూ సంఘం నాయకులు సత్తి నాగేశ్వరరెడ్డి, సీహెచ్‌వీ రమేశ్, నియోగి, రవిశంకర్, మధుసూదనరావు, కలెక్టర్ ఏవో కేవీ ఈశ్వరరావు సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

పద్మనాభం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంట, కొత్త కొవ్వాడ గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది.ఆయా ఆలయాల్లో ఉన్న హుండీలను దొంగలు ఎత్తుకుపోయారు. రెండు హుండీల్లో సుమారు రూ. 20 వేల నగదు ఉంటుందని ఆయా గ్రామాల పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, అనుమానితులను విచారిస్తున్నారు.

బాలుడికి రక్షణ కల్పించిన పోలీసులు


ఎండాడలో ఒంటరిగా తిరుగుతున్న బాలుడు

ఎండాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఒంటరిగా తిరుగుతున్న బాలుడ్ని (11) పీఎంపాలెం పోలీసులు గురువారం స్టేషన్‌కు తీసుకువెళ్లి వివరాలు ఆరాతీశారు.తన తల్లిదండ్రులు రంజిత్, సుభాషిత కొద్ది రోజుల క్రితం చనిపోయారని, అప్పటి నుంచి ఆరిలోవ, సింహాచలం ప్రాంతాల్లో తిరుగుతున్నానని బాలుడు చెప్పాడు. విశాఖలో బంధువులు ఉన్నా.. వారి వివరాలు తెలియవని చెప్పడంతో పోలీసులు బాలుడ్ని విశాఖ ప్రభుత్వ బాలుర సంరక్షణ గృహానికి అప్పగించారు. వివరాలు తెలిసిన వారు పీఎంపాలెం స్టేషన్‌లో గాని, ప్రభుత్వ బాలుర సంరక్షణ గృహం అధికారులకు తెలియజేయాలని కోరారు.





చికాకు పెట్టే మెనోపాజ్!

మహిళల్లో రుతుక్రమం నిలిచిపోయే దశలో ఇబ్బందులు

వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు అనివార్యం. ఆ సమయంలో కొన్నిరకాల ఇబ్బందులు వేధిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ దశలో చిరాకు, కోపం, డిప్రెషన్ తదితర సమస్యలు ఎదురవుతాయి. వాటిపై సరైన అవగాహన ఉంటే సమర్థంగా ఎదుర్కొనే వీలుంటుంది. ఆందోళన చెందితే సమస్యలు అధికమవడమే కాకుండా మరిన్ని అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదముంటుంది.

- అనారోగ్య సమస్యలు వెంటాడే అవకాశం
- అవగాహన లేక అనేకమందిలో ఆందోళన
- నివారణ మార్గాలతో సమస్యలకు చెక్
- యోగా, మెడిటేషన్, ఆహార అలవాట్లలో మార్పులు తప్పనిసరి
- నేడు వరల్డ్ మెనోపాజ్ డే



విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో మెనోపాజ్ దశ అత్యంత కీలకమైనది. ఈ దశలో అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మెనోపాజ్ అంటే మహిళల్లో (పీరియడ్స్) రుతుక్రమం పూర్తిగా ఆగిపోవడం. రుతుక్రమం జరగడానికి, మహిళలకు సంబంధించిన ఇతర లక్షణాలకు ఈస్ట్రోజన్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. రుతుక్రమం ఆగిపోయిన తరువాత ఈ హార్మోన్ తగ్గిపోతుంది. దీనివల్ల వివిధ సమస్యలు వేధిస్తాయి. వీటిపై మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 18న వరల్డ్ మెనోపాజ్ డే నిర్వహిస్తున్నారు. ప్రతి మహిళ జీవితంలో మెనోపాజ్ సర్వసాధారణం. అయితే ఈ దశలో ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహనలేక సతమతమవుతుంటారు. ఈ దశలో ఎదుర్కొనే సమస్యల్లో హాట్ ఫ్లాష్ అత్యంత కీలకమైనది. ఈ లక్షణంతో బాధపడే మహిళలు ఫ్యాన్ కింద ఉన్నా, ఏసీ రూముల్లో ఉన్నా తీవ్రమైన చెమటతో బాధపడుతుంటారు. ఒళ్లు వేడిగా ఉంటుంది. దీనివల్ల రోజువారీ చేసే పనులపై ఆసక్తి చూపరు. మూడ్‌లో తరచూ మార్పులు వస్తుంటాయి. విపరీతమైన కోపం, యాంగ్జైటీ లక్షణాలుంటాయి. దీనివల్ల కుటుంబ కలహాలు మొదలవుతుంటాయి. కొందరిలో డిప్రెషన్ వేధిస్తుంది. నిద్ర పట్టకపోవడం, ఎముకల సామర్థ్యం తగ్గిపోతుంది. యూరినరీ సంబంధిత సమస్యలు వేధిస్తాయి. అవగాహన లేక వాటిని భరిస్తూనే ఉంటారు. కొన్ని జాగ్రత్తలు తీసు కోవడం, మందులను వేసుకోవడం ద్వారా ఈ సమస్యలకు కొంతవరకు చెక్ చెప్పే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

నివారించే మార్గాలివే..

మెనోపాజ్ దశలో ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు కొన్ని మార్గాలున్నాయి. ఇందుకోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. తగ్గిపోయిన ఎముకల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కాల్షియం, విటమిన్ డి టాబ్లెట్లు వేసుకోవాలి. ఒత్తిడి, యాంగ్జైటీ, డిప్రెషన్ నుంచి బయటపడేందుకు యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలి.మెనోపాజ్ దశలో ఎదురయ్యే ఇబ్బందులు పట్ల అవగాహన ఉన్నప్పుడే ఈ జాగ్రత్తలను పాటించేందుకు అవకాశంఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అవగాహన లేక ఇబ్బందులు

- డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్, గైనకాలజీ, కేజీహెచ్



మెనోపాజ్ దశ పట్ల అవగాహన లేక చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇందుకోసం కేజీహెచ్‌లో ప్రత్యేకంగా మెనోపాజ్ క్లినిక్ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ కనీసం 20 మంది మహిళలు వస్తుంటారు. ఆయా లక్షణాలతో బాధపడే వారిలో దాదాపు 80 శాతం మందికి కారణం కూడా తెలియడం లేదు. కొన్ని సమస్యలకు ఆహార అలవాట్లు, యోగా, మెడిటేషన్ ద్వారా చెక్ చెప్పవచ్చు. మెనోపాజ్ దశకు చేరిన వారిలో కొన్నిరకాల కేన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది. కాబట్టి క్లినిక్‌కు వచ్చిన మహిళలకు ప్యాప్స్మియర్, మామోగ్రఫీ టెస్ట్ నిర్వహించి సర్వైకల్, రొమ్ము కేన్సర్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాం.

హార్మోనల్ థెరపీతో మేలు

- డాక్టర్ టి.రాధ, విశ్రాంత ప్రిన్సిపాల్, ఆంధ్ర మెడికల్ కళాశాల



మెనోపాజ్ దశకు చేరిన మహిళల్లో ఇబ్బందులు వస్తుంటాయి. వీటినుంచి ఉపశమనం పొందేందుకు గతంలో కొన్నాళ్లపాటు హార్మోనల్ థెరపీ కింద ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్లను ఇచ్చేవారు. అయితే 2002లో ఒక స్టడీ వచ్చింది. హార్మోన్ థెరపీ వల్ల ఎక్కువ మంది మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు పెరగడంతో పాటు స్ట్రోక్ రిస్క్ పెరుగుతోందని తేలింది. కొందరిలో రొమ్ము కేన్సర్ ముప్పు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఈ థెరపీని నిలిపేశారు. ఆయా లక్షణాలతో బాధపడుతూ 60 ఏళ్లలోపు మెనోపాజ్ దశలో ఉన్న వారికి మాత్రమే హార్మోనల్ థెరపీ ఇస్తున్నారు. వైద్యుల సలహాపై ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ ఇస్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. 1984 నుంచి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ మెనోపాజ్ సొసైటీ మెనోపాజ్ డే నిర్వహిస్తూ వస్తోంది. ప్రకృతి సిద్ధంగా జరిగే మహిళల్లో సహజ ప్రక్రియ వల్ల ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించడమే దీని ధ్యేయం.

మహా జ్ఞాని వాల్మీకి: కలెక్టర్



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి తాత్వికుడు, మహాజ్ఞాని అని, అతని జీవిత విశేషాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువా రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతంలో రామాయణం రచించి ప్రపంచానికి మహత్తర సందేశాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.మోహనకుమార్, బీసీ సంక్షేమశాఖాధికారిణి శ్రీదేవి, వాల్మీకి సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, గాజువాక డిపో కార్యదర్శి పిళ్లా శంకరరావు, డివిజనల్ అధ్యక్షుడు వీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులపై రెండేళ్లుగా విశాఖ రీజనల్ మేనేజర్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మహిళా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సమస్యలు పరిష్కరించకుండా రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పల్లాను కలిసిన వారిలో టీఎస్ఎస్ రావు, సంజీవి, జీఎన్మూర్తి తదితరులున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన పెరగాలి

న్యూరాలజీ వైద్యుల సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గుండె జబ్బులతో సమానంగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని, కానీ అవగాహన పెరగడం లేదన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో 31వ జాతీయ సదస్సు నోవాటెల్‌లో జరుగుతోంది. రెండో రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బ్రెయిన్ స్ట్రోక్ కారణాలు, చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్ట్రోక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి రెండు వేల మందికిపైగా న్యూరాలజీ వైద్యులు సదస్సులో పాల్గొని చర్చించడం గొప్ప విషయమన్నారు. ఇండియన్ అసోసియే షన్ ఆఫ్ న్యూరాలజీ (ఐఎఎన్) ప్రెసిడెంట్ డాక్టర్ దేబాశిష్‌చౌదరి మాట్లాడుతూ న్యూరాలజీలో భిన్నమైన సమస్యలున్నాయన్నారు. ఆయా డివిజన్లలో ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందించాలన్నారు. అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ యు.మీనాక్షి సుందరం మాట్లాడుతూ న్యూరాలజీ వైద్యులు పరిశోధనలపైనా దృష్టి సారించాలన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సెక్రటరీ డాక్టర్ ఎస్.గోపి, వైద్యులు డాక్టర్ సత్య వరప్రసాద్, డాక్టర్ ఎం మధుసూదన్‌బాబు, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో మూర్ఛ వ్యాధి, బ్రెయిన్‌స్ట్రోక్, న్యూరో సమస్యలకు అధునాతన వైద్య పద్ధతులు, జెనిటిక్ ఇష్యూస్‌పై చర్చించారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మాతా, శిశు మరణాలపై దృష్టి సారించాలి

విశాఖపట్నం: జిల్లాలో మాతా, శిశు మరణాలను పూర్తిగా నివారించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జాతీయ ఆరోగ్య ప్రోగ్రామ్స్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పిజగదీశ్వరరావు, ఆస్పత్రుల సమన్వయాధి కారి డాక్టర్ గౌరీ శంకర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా ధాన్యం సేకరించండి: జేసీ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండే ధాన్యాన్ని విరివిగా కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ధాన్యం సేకరణపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలుచేసే ఏజెన్సీలు తేమ గుర్తించే మీటర్లు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాటాలు సమకూర్చుకోవాలన్నారు. సకాలంలో గోనెసంచులు అందించాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలత, డీఎస్‌వో భాస్కరరావు, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, రైసుమిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో తూర్పు గోదావరి డీపీవో మృతి

ఉమ్మడి జిల్లాలో రెండున్నర దశాబ్దాలు పనిచేసిన శ్రీనివాసరావు

స్వస్థలం భీమునిపట్నం



శ్రీనివాసరావు (ఫైల్)

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు బుధవారం రాత్రి గుండెపోటుతో రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. విశాఖ జిల్లా భీమిలికి చెందిన శ్రీనివాసరావు 1999లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో పనిచేశారు. పదోన్నతి తరువాత విశాఖ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహించారు. అనంతరం సుమారు నాలుగేళ్లు విశాఖ జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. గత నెలలో జరిగిన బదిలీల్లో తూర్పుగోదావరి జిల్లా డీపీవోగా నియమితులయ్యారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతి పట్ల జిల్లాలో పలువురు అధికారులు సంతాపం వ్యక్తంచేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవలస పంచాయతీ పారిశుధ్య కార్మికుడు గోకా ఈశ్వరరావు (43) గురువారం రాత్రి దోమల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గౌరి తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వరరావుకు మద్యం సేవించే అలవాటు ఉంది. దీంతో దంపతుల మధ్య గొడవలు జరిగేవి. గురువారం రాత్రి మద్యం తాగి రావడంతో భార్య రమాదేవితో గొడవ జరిగింది. దీంతో దోమల నివారణ మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబసభ్యులు కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అగనంపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దిబ్బపాలెంలో చోటు చేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సిద్ధనాతి వెంకటరమణ కుమారుడు లోకేశ్ (27) బీటెక్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో రైల్వేట్రాక్‌పై లోకేశ్ పడి ఉండడాన్ని పలువురు గుర్తించి సమాచారం అందించారు. అతడి శరీరంపై గాయాలుండడంతో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రైలు ఢీకొని మృతి చెందాడా, ఇంకేమైనా జరిగిందా తెలియాల్సి ఉంది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాతయ్యపాలెంలో చైన్ స్నాచింగ్

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట పువ్వులు కోస్తున్న ఓ మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు తెంచుకుపోయారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాతయ్యపాలేనికి చెందిన గేదల పైడమ్మ ఇంటి సమీపంలో పువ్వులు కోస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు పైడమ్మను చిరునామా అడిగారు. తెలియదని చెబుతుండగా ఆమె మెడలోని పుస్తెలతాడు తెంచుకుని ఉడాయించారు. సీఐ శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సమీపంలో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన యువకుడి అరెస్టు

ఎండాడ. అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో చోరీ కేసు దర్యాప్తు చేస్తుండగా బైక్‌లు, ఆటోలను చోరీ చేసిన దొంగ దొరికాడు. సీఐ ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల మధురవాడ మిథిలాపురి కాలనీలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. దీనిపై పోలీసులు మధురవాడకు చెందిన టేకుపూడి కనకరాజు (21)ను అదుపులోకి తీసుకుని విచారించగా వివిధ స్టేషన్ల పరిధిలో మూడు ఆటోలు, మూడు బైక్‌ను చోరీ చేసినట్టు అంగీకరించాడు. అతడి నుంచి వాహనాలను, సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ ప్రకాశ్, ఏఎస్ఐ కె.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు నాగరాజు, మల్లిక్‌ను డీసీపీ కె.లతామాధురి, ఏసీపీ వెంకట్రావు అభినందించారు.



ఐఓసీఎల్ పైప్‌లైన్ పనుల్లో అపశ్రుతి

- పైపుల బరువుకు పక్కకు ఒరిగిపోయిన క్రేన్
- పక్కనే అమోనియం పైపులు : తప్పిన పెను ప్రమాదం

మల్కాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో అమ్మోనియం పైప్‌లైన్‌పై పడాల్సిన ఓ భారీ క్రేన్ పక్కకు ఒరగడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సింధియా జంక్షన్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పోర్టు జెట్టీ నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)కి కొత్తగా రోడ్డు నుంచి 50 అడుగుల ఎత్తున పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి సమయంలో ట్రాఫిక్‌ను నిలుపుదల చేసి క్రేన్ సహాయంతో సుమారు 20 టన్నుల బరువు కలిగిన పైప్‌లైన్‌ను పైకి లేపుతుండగా ఒక్కసారిగా క్రేన్ పక్కకు ఒరిగిపోయింది.. దీంతో ఆ పైప్‌లతోపాటు ఉన్న స్ట్రక్చర్ కూడా ఒక్కసారిగా కూప్పకూలిపోయింది. అయితే ఆ పక్కనే ఉన్న అమ్మోనియం పైప్ లీకైతే భారీ ప్రాణ నష్టం సంభవించేది. కానీ మరో పక్కకు క్రేన్ ఒరిగిపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా ఘటనా సమయంలో 20 మంది పనిచేస్తున్నారు. వీరంతా పరుగు తీసి ప్రాణాలను దక్కించుకున్నారు. క్రేన్ ఆపరేటర్ కిందకు దూకేసి పరారయ్యాడు. ఈ ఘటనతో గాజువాక, మల్కాపురం ప్రాంతాల నుంచి వెళ్లాల్సిన, నగరం నుంచి ఈ ప్రాంతానికి రావాల్సిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పోలీసులతో వాహనదారులు వాగ్వాదానికి దిగారు. కొందరు ములగాడ గ్రామం నుంచి షీలానగర్ రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఒరిగిపోయిన క్రేన్ తొలగింపు పనులు గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగాయి.



ఒరిగిపోయిన క్రేన్, మరో క్రేన్ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం